# జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు






మంగళవారం 22 సెప్టెంబర్ 2026 పేజీలు : 8

# విద్యుత్తు కోత

ఉదయం 9 గంటల నుంచే భానుడి ప్రతాపం


భిన్నంగా జిల్లాలో వాతావరణ పరిస్థితులు

పగలు ఎండలు ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా అడపాదడపా కురుస్తున్న చిరుజల్లులు ఉపశమనం

జిల్లాలో ఇష్టానుసారంగా విధిస్తున్న కరెంటు కోతలు ప్రజలు ఆందోళన

కాగజ్‌నగర్

ఎల్‌నినో ప్రభావంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. సాధారణంగా సెప్టెంబరులో ఆహ్లాదకరమైన చల్లటి వాతావరణం ఉంటుంది. కానీ అందుకు భిన్నంగా జిల్లాలో వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. వర్షాలు కురవక పోవడం, వేసవిలో ఉన్నామా అన్నట్లు భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. పగలు ఎండలు ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా అడపాదడపా కురుస్తున్న చిరుజల్లులు ఉపశమనం కలిగిస్తున్నాయి. అయితే జిల్లాలో ఇష్టానుసారంగా విధిస్తున్న కరెంటు కోతలు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచే భానుడి ప్రతాపం కొనసాగుతోంది.




# నాలుగు దశాబ్దాల తర్వాతా కూడా చెదరని స్నేహబంధం



ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు పూర్వ విద్యార్థుల ఆత్మీయ జన్మదిన శుభాకాంక్షలు..

కాలం మారినా మారని అనుబంధం.. నాటి మిత్రుల ఆత్మీయ కలయిక..

కళాశాల రోజుల మధుర జ్ఞాపకాలకు మళ్లీ జీవం.. ఆనందోత్సాహాల మధ్య జన్మదిన వేడుకలు

# ఎయిర్‌పోర్ట్ పనులను వేగవంతం చేయాలి



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 21,(ప్రజా జ్యోతి)** జిల్లాలో ప్రతి ష్టాత్మక విమానాశ్రయ నిర్మాణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మంది రంలో విమానాశ్రయ ప్రాజెక్టు పనుల పురోగతిపై ఆయన అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్య మంత్రి నేడు విమానాశ్రయ ప్రాజెక్టుపై ప్రత్యేక సమీక్ష ని ర్వహించనున్న నేపథ్యంలో, ఈ సమావేశానికి ప్రాజెక్టుకు సంబం ధించిన సమగ్ర వివరాలు, తాజా నివేదికలతో పూర్తి సన్నద్ధంగా ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు.

## ప్రభుత్వ ఉద్యోగులందరికీ

# శాలరీ ప్యాకేజీ బీమా వర్తిం పజేయాలి



జీవో నెం. 77 ప్రకారం ప్రయోజనాలు కల్పించాలి

జిల్లా కలెక్టర్‌కు ‘టీఈజేఏసీ నేతల వినతి

బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ

# ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు టీఎన్జీవో నేతల జన్మదిన శుభాకాంక్షలు

## ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతి



**మంచిర్యాల, 21, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో టీఎన్జీవో నాయకులు సోమవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి ఆయనకు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి మాట్లాడుతూ.. మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధితో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంక్షేమానికి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సహకరించాలని కోరారు. ప్రభుత్వం నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు రావాల్సిన పీఆర్సీ, పెండింగ్ డీఏలు, ఇతర బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనకరంగా ఉండే సమర్థవంతమైన ఈహెచ్ఎస్ విధానాన్ని అమలు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. టీఎన్జీవో నాయకుల వినతిపై ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సానుకూలంగా స్పందిస్తూ.. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కార్యదర్శి బొడ్డు శ్రావణ్ కుమార్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు, కోశాధికారి సతీష్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కేజియా రాణి, తిరుపతి, రామ్ కుమార్, సత్యనారాయణ, నరేందర్, అంజయ్య, సంయుక్త కార్యదర్శులు సునీత, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు దశాబ్దాల తర్వాతా కూడా చెదరని స్నేహబంధం

### ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు పూర్వ విద్యార్థుల ఆత్మీయ జన్మదిన శుభాకాంక్షలు..

### కాలం మారినా మారని అనుబంధం.. నాటి మిత్రుల ఆత్మీయ కలయిక..

### కళాశాల రోజుల మధుర జ్ఞాపకాలకు మళ్లీ జీవం.. ఆనందోత్సాహాల మధ్య జన్మదిన వేడుకలు







**మంచిర్యాల, 21, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**కాలం నాలుగు దశాబ్దాలు దాటినా.. నాటి కళాశాల స్నేహం మాత్రం చెక్కుచెదరలేదు. ఒకే తరగతి గదిలో కలిసి చదువుకున్న స్నేహితులు, జీవితంలో ఎన్నో మలుపులు దాటినా తమ అనుబంధాన్ని కొనసాగిస్తూ మరోసారి ఆత్మీయంగా కలుసుకున్నారు. నాటి స్నేహితుల మధ్య నేటికీ అదే ఆప్యాయత, అదే అనురాగం వెల్లివిరిసింది. మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు జన్మదినం సందర్భంగా మంచిర్యాల డిగ్రీ కళాశాలలో సుమారు 40--45 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు, ఎమ్మెల్యే క్లాసు మేట్స్ ఇతర స్నేహితులు సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని ఆత్మీయంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును పూర్వ విద్యార్థులు శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేయించి, ఒకరికొకరు ఆత్మీయంగా కేక్ తినిపించుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఎన్నో సంవత్సరాల తర్వాత కలుసుకున్నప్పటికీ, నాటి స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ కళాశాల రోజుల మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాలుగు దశాబ్దాల కాలంలో జీవితాల్లో ఎన్నో మార్పులు వచ్చినా, నాటి స్నేహం మాత్రం మారలేదని ఈ ఆత్మీయ కలయిక మరోసారి చాటిచెప్పింది. వయసు పెరిగినా.. కాలం గడిచినా.. నిజమైన స్నేహానికి దూరం ఉండదని నిరూపిస్తూ పూర్వ విద్యార్థులంతా ఒక కుటుంబంలా కలసి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు జన్మదిన వేడుకలను నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఈ ఆత్మీయ కలయిక నాటి కళాశాల స్నేహానికి, నేటికీ కొనసాగుతున్న అనుబంధానికి మధుర జ్ఞాపకంగా నిలిచింది.

## భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్న గణేష్ నవరాత్రులు



**జన్నారం,సెప్టెంబర్21(ప్రజాజ్యోతి)** జన్నారం మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో గణేష్ నవరాత్రులు భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి.వినాయక చవితి నుండి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువజన సంఘాలు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మండపాలను విద్యుత్ దీపాలతో, పూలతో అందంగా అలంకరించారు. పలు చోట్ల అన్న దాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మండల ఆర్యవైశ్య సంఘము మరియు వర్తక సంఘం ఆధ్వర్యం లో ఏర్పాటుచేసిన గణేశుడు వద్ద శుక్రవారం సాయంత్రం 108 రకాల నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాకుండా ప్రతిరోజు అన్నదానాలు నిర్వహిస్తున్నారు.మండల కేంద్రం లోని శ్రీరామ్ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణేశుడిని ఎస్.ఐ ఉదయ్ కిరణ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరుపుకోవాలని దీనికి ప్రజలందరూ సహకరించాలని కోరారు.

## ప్లాస్టిక్ వాడితే ఆరోగ్యానికి, పర్యావరణానికి ముప్పు



**జన్నారం,సెప్టెంబర్21(ప్రజాజ్యోతి)**స్వచ్ఛతా హిసేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని తపాలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ కొల్లూరు కమలాకర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి, మూగజీవులకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్లాస్టిక్ భూమిలో కలిసిపోవడానికి వందల సంవత్సరాలు పడుతుందని, దానివల్ల భూమి నిస్సారంగా మారుతుందని తెలిపారు. వేడి ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లు, కంటైనర్లలో తీసుకోవడం వల్ల విషపూరిత రసాయనాలు ఆహారంలో చేరి క్యాన్సర్, హార్మోన్ల అసమతుల్యత వంటి తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరించారు.వాడి పారేసిన ప్లాస్టిక్ కవర్లను ఇష్టానుసారంగా బయట పడేయడం వల్ల మురుగు కాలువలు మూసుకుపోయి నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెంది అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలిద్దాం అంటూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయు లు తుంగూరి గోపాల్, ఆయుర్వేద వైద్యాధికారి డా. నాగదీపాం జలి, గ్రామ సర్పంచ్ మురిమడుగుల కవిత రాజన్న, ఉప సర్పంచ్ మామిడి రాజన్న, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఉపాధ్యాయులు చంద్రిక, రామా రావు, శ్రీనివాస్, ఆశా కార్యకర్త లలిత తదితరులు పాల్గొన్నారు.

# టీఎన్జీవో హౌసింగ్ కాలనీ నస్పూర్‌లో ఏడో రోజు మహా అన్నదానం

### దాతృత్వంతో ముందుకొచ్చిన పుణ్య దంపతులకు ఘన సన్మానం

### భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న శ్రీ సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు

**మంచిర్యాల, 21, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ నస్పూర్‌లోని శ్రీ సిద్ధి వినాయక గణేష్ మండలి వద్ద ఏడో రోజు మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీమతి, శ్రీ నడిమెట్ల శ్రీలత--సత్యనారాయణ దంపతులు, శ్రీమతి, శ్రీ జిలకర రాధ--కృష్ణ దంపతుల ఆధ్వర్యంలో ఏడో రోజు మహా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో కాలనీవాసులు, భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు గడియారం శ్రీహరి మాట్లాడుతూ.. శ్రీ సిద్ధి వినాయకుని సన్నిధిలో ఏడో రోజు మహా అన్నదానానికి సహకరించిన నడిమెట్ల శ్రీలత--సత్యనారాయణ, జిలకర రాధ--కృష్ణ పుణ్య దంపతులకు స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతిరోజూ మధ్యాహ్నం మహా అన్నదానం, సాయంత్రం అల్పాహార కార్యక్రమాలను దాతల సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో అన్నదానానికి సహకరించిన రెండు పుణ్య దంపతులను టీఎన్జీవో



హౌసింగ్ సొసైటీ తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ ఉత్సవ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు గుండేటి యోగేశ్వర్, కార్యదర్శి కస్తూరి నాగేశ్వర్, సొసైటీ కార్యదర్శి హబీబ్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు సైండ్ల మొండయ్య, నాయకులు పుప్పాల హనుమంతరావు, పొన్న మల్లయ్య, శ్రీపతి బాపురావు, బొడ్డు శ్రావణ్ కుమార్, భూముల రామ్మోహన్, తిరుపతి రెడ్డి, సునీత, టి.తిరుపతి, జె.రాంకుమార్, ప్రసాద్, ఉషన్నతో పాటు టీఎన్జీవో హౌసింగ్ కాలనీ నాయకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# చెత్తాచెదారంతో అష్టకష్టాలు.. బాధితురాలి కన్నీటి గోడు

### అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పరిష్కారం లేదని ఆవేదన

### ఇంటి ఆవరణలో చెత్త వేస్తున్నారని ఆరోపణ.. మీడియా ఎదుట బోరున విలపించిన రశిక

**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 21 (ప్రజాజ్యోతి):**వాంకిడి గ్రామపంచాయతీ పరిధిలోని ఒకటో వార్డుకు చెందిన రాంటెంకి రశిక, భర్త భీంరావు తమ ఇంటి ఆవరణలో చెత్తాచెదారం వేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇంటి చుట్టూ పారిశుద్ధ్య సమస్య నెలకొనడంతో దుర్వాసన భరించలేని పరిస్థితి ఏర్పడుతోందని ఆమె ఆరోపించారు. సమస్యను పరిష్కరించాలని గ్రామపంచాయతీ అధికారులను, ఒకటో వార్డు సభ్యుడిని, సర్పంచ్, కార్యదర్శిని పలుమార్లు ఆశ్రయించినా తన సమస్యకు పరిష్కారం లభించలేదని వాపోయారు. తమ ఇంటి ఆవరణకు సమీపంలో చెత్తాచెదారం వేయడం వల్ల వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని బాధితురాలు తెలిపారు. చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోందని, ఇంట్లో కుటుంబ సభ్యులు ప్రశాంతంగా ఉండలేని పరిస్థితి ఏర్పడిందని కన్నీటి పర్యంతమయ్యారు. పారిశుద్ధ్య సమస్య కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులకు వివరించినప్పటికీ సమస్యను పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు.

**ఎవరిని ఆశ్రయించినా.. పరిష్కారం కనిపించలేదని ఆవేదన**

తనకు ఎదురవుతున్న ఇబ్బందులను ముందుగా స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినట్లు రశిక తెలిపారు. ఒకటో వార్డు సభ్యుడికి విషయం చెప్పడంతో పాటు గ్రామపంచాయతీ సర్పంచ్, కార్యదర్శి, సంబంధిత సిబ్బందికి కూడా సమస్యను వివరించినట్లు పేర్కొన్నారు. సమస్యను పరిశీలించి చెత్తాచెదారం తొలగించి, భవిష్యత్తులో తమ ఇంటి పరిసరాల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. అయితే తన ఫిర్యాదులపై స్పష్టమైన పరిష్కారం కనిపించకపోవడంతో చివరకు మీడియాను ఆశ్రయించాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. తన సమస్యను ప్రజల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా అయినా అధికారులు స్పందించి న్యాయం చేస్తారనే ఆశతో మీడియా ముందుకు వచ్చినట్లు తెలిపారు. మీడియా ఎదుట కన్నీటి పర్యంతం తన సమస్యను వివరిస్తూ రశిక మీడియా ఎదుట బోరున విలపించిన దృశ్యం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో తాను తీవ్ర మనస్తాపానికి గురవుతున్నానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి ఆవరణలో చెత్త వేయకుండా చర్యలు



తీసుకోవాలని, ఇప్పటికే పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేయాలని వేడుకున్నారు. తమ కుటుంబం నివసించే ప్రాంతంలో పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడటం గ్రామపంచాయతీ బాధ్యత అని, కనీసం తమ గోడును విని సమస్యను పరిష్కరించాలని ఆమె కోరారు. సమస్యను పరిష్కరించకపోతే తమ పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని కన్నీటి పర్యంతమయ్యారు.

**అధికారుల స్పందన కోసం ఎదురుచూపు**

గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, చెత్తను నిర్ణీత ప్రాంతాలకు తరలించడం వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఒక కుటుంబం తమ ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి వాస్తవ పరిస్థితులను గుర్తించాలని కోరుతున్నారు. బాధితురాలి ఆరోపణలపై గ్రామపంచాయతీ అధికారులు స్పందించి సమస్యకు కారణాలను పరిశీలించి, నిజానిజాలు నిర్ధారించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. చెత్తను తొలగించడంతో పాటు భవిష్యత్తులో మళ్లీ అదే ప్రాంతంలో చెత్త పేరుకుపోకుండా శాశ్వత పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు."మా సమస్యను ఎన్నిసార్లు చెప్పినా పరిష్కారం కాలేదు.. ఇకనైనా అధికారులు స్పందించి మా ఇంటి పరిసరాల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలి. మేము కూడా మనుషులమే.. ప్రశాంతంగా జీవించే పరిస్థితి కల్పించాలి" అంటూ రశిక కన్నీటి పర్యంతమయ్యారు.

## కబ్జాకు గురైన చెరువును కాపాడాలని రిలే నిరాహార దీక్ష

**చెరువును కాపాడే వరకు దీక్ష విరమించేది లేదు**



**జన్నారం,సెప్టెంబర్21(ప్రజాజ్యోతి)** జన్నారం మండలంలోని రేండ్లగూడ గ్రామ అల్లం వారి కుంట కబ్జాకు గురైందని,కబ్జాకు గురైన చెరువును పరిరక్షించాలని కోరుతూ గ్రామానికి చెందిన పలువురు సోమవారం రోజున రేండ్లగూడ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేండ్లగూడ గ్రామ శివారులో సర్వేనెంబర్ 160, 161 లో ఉన్న 24 ఎకరాల కుంట కబ్జాకు గురై ప్రస్తుతం రెండు ఎకరాలు మాత్రమే మిగిలిందని, ఇట్టి విషయంపై కలెక్టర్కు ఇరిగేషన్ అధికారులకు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామని అన్నారు. కలెక్టర్ ఆదేశాలతో కొన్ని రోజుల క్రితం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే చేశారని, కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని అల్లం వారి కుంట ను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, చెరువుకు పూర్వ వైభవం వచ్చేదాకా పోరాటం ఆపేదే లేదని అన్నారు.ఈ రిలే నిరాహారదీక్ష లో సముద్రాల శంకర్,దాసరి తిరుపతి, అల్లం పెద్దన్న, ఆకుల మధు, వెయికండ్ల రవి, పవన్,సురేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## సర్ లో అక్రమంగా ఓటు నమోదుకు యత్నం

**- విచారణ చేయాలని కలెక్టర్ కు ఫిర్యాదు**



**జన్నారం,సెప్టెంబర్21(ప్రజాజ్యోతి)** మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కవ్వాల్ గ్రామ పంచాయతీలో ఓటరు జాబితా నమోదు (సర్) లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని సర్పంచ్ లకావత్ సక్కు నాయక్ ఆరోపించారు. సోమవారం రోజున మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ సక్కు నాయక్ మాట్లాడుతూ గతంలో ఉమ్మడి కవ్వాల్ గ్రామ పంచాయతీగా ఉన్న తమ పంచాయతీ ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం మూడు పంచాయతీలుగా విభజించడం జరిగిందని, కవ్వాల్ గ్రామపంచాయతీ నుండి హోస్టల్ తండా, బంగారు తండా గ్రామపంచాయతీ లు ఏర్పడ్డాయని అన్నారు.ప్రస్తుతం జరుగుతున్న సర్ ప్రక్రియలో స్థానికంగా నివాసం లేని కొందరు వ్యక్తులు, ఇతర పంచాయతీలకు చెందిన వారు తమ పంచాయతీ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారికి గ్రామంలో నివాసం, ఇంటి పన్ను, రేషన్ కార్డు వంటి ఎలాంటి ఆధారాలు లేవని, కొందరు తప్పుడు, అనుమానాస్పద పత్రాలను సమర్పిస్తున్నారని ఆరోపించారు. కావున ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకున్న వ్యక్తుల నివాస స్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, వారు సమర్పించిన పత్రాల నిజానిజాలను ధృవీకరించాలని కోరారు. విచారణలో నివాసం లేని వ్యక్తులు తప్పుడు పత్రాలతో ఓటు నమోదుకు ప్రయత్నించినట్లు తేలితే చట్టపరంగా, ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో బాపూజీ ఘన నివాళి....



**బెజ్జూర్ సెప్టెంబర్ 21(ప్రజాజ్యోతి):** మండలకేంద్రంలో సోమవారం నాడు స్వాతంత్ర్య సమరయోధుడు బడుగు బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత తెలంగాణ ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించిన జాతి గర్వించదగ్గ ఉద్యమకారుడు స్వరాష్ట్ర సాధన కోసం పదవులను సైతం వదులుకొని మలిదశ ఉద్యమానికి మార్గదర్శకంగా నిలచిన రాజకీయవేత్త తన జీవితాంతం బడుగు బలహీన వర్గాల కోసం పాటుపడిన ప్రముఖ సామాజికవేత్త" ఆచార్య శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆ మహానీయునికి ఘన నివాళులు అర్పించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో మండల అధ్యక్షులు సామల తిరుపతి ప్రధాన కార్యదర్శి కనుకుట్ల వెంకటేష్ కార్యవర్గ సభ్యులు పర్స గణేష్ సామల వెంకటేశం కనుకుంట్ల శ్రీనివాస్ పర్స రమేష్ జోర్రిగల శ్రీనివాస్ ఇప్పకాయల శంకర్‌కుల బాంధవులు అభిమానులు పాల్గొన్నారు

## ఏకో పార్క్ పనులు త్వరితగతిన పూర్తిచేసి వీలున్నంత త్వరలో అందుబాటులోకి తేవాలి

**శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్**



**మంచిర్యాల, 21,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణలో భాగంగా సింగరేణి సంస్థ చేపడుతున్న పర్యావరణహిత చర్యల్లో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ ఓసీపీ ప్రాంగణంలో నిర్మిస్తున్న నూతన ఏకో పార్కు పనులను త్వరితగతిన పూర్తిచేసి వీలున్నంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఎస్ఆర్పీ ఓసీపీ ప్రాంగణంలో నిర్మిస్తున్న ఏకో పార్కు పనుల పురోగతిని సోమవారం ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ స్వయంగా తనిఖీ చేశారు. సంబంధిత అధికారులతో కలిసి పార్కు నిర్మాణ పనుల తీరుతెన్నులను పరిశీలించారు. పార్కులో ఏర్పాటు చేస్తున్న వాటర్ ఫౌంటెన్లు, వాకింగ్ ట్రాక్, లైటింగ్, లేక్‌తో పాటు ఇతర నిర్మాణ పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను వీలున్నంత త్వరగా పూర్తిచేసి అతి త్వరలో ఏకో పార్కును శ్రీరాంపూర్ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పార్కు ప్రారంభం అనంతరం శ్రీరాంపూర్ ఏరియాకే ఒక ఐకాన్‌గా నిలిచేలా తీర్చిదిద్దాలని, పిల్లలు, పెద్దలు సేదతీరే విధంగా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని అధికారులకు సూచించారు. ఏకో పార్కు పనుల పురోగతిని వారం రోజుల అనంతరం మరోసారి తనిఖీ చేస్తానని, అప్పటివరకు పనులు దాదాపుగా పూర్తికావాలని జీఎం మునిగంటి శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్పీ ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, డీజీఎం (ఫారెస్ట్) హరినారాయణ, సివిల్ హెచ్ఓడీ ఏ. రవికుమార్, డీవైఎస్ఈ గుండెరావు, డీవైఎస్ఈ (ఎలక్ట్రికల్) మధుకర్, సివిల్, ఫారెస్ట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలే కుటుంబం.. ప్రజాసేవే లక్ష్యం!

### నేడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు జన్మదిన వేడుకలు

### ప్రజల మనిషిగా ప్రత్యేక గుర్తింపు.. అభిమానులు, కాంగ్రెస్ శ్రేణుల్లో సందడి



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 21 ప్రజా జ్యోతి** ప్రజా సమస్యలపై స్పందిస్తూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ.. కార్యకర్తలకు అండగా నిలుస్తూ రాజకీయ, సామాజిక కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు జన్మదిన వేడుకలు నేడు ఘనంగా జరగనున్నాయి. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు, శ్రేయోభిలాషులు ప్రత్యేక కార్యక్రమాలకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలువురు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేస్తుండగా.. అభిమానుల్లో సందడి నెలకొంది.

**ప్రజా సమస్యలే ఎజెండాగా..**

కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు రాజకీయ జీవితంలో ప్రజా సమస్యలకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్నారని ఆయన అభిమానులు, పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతున్నారని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉండటం, వారి సమస్యలను స్వయంగా తెలుసుకోవడం ఆయన ప్రజా జీవితంలో కొనసాగుతున్న విధానమని పేర్కొన్నారు.

**కార్యకర్తలకు అండగా..**

పార్టీ కార్యకర్తలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ వారి సమస్యల పరిష్కారానికి సహకరిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో కార్యకర్తలను భాగస్వాములను చేస్తూ, నాయకులు--కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కష్టసమయాల్లో కార్యకర్తలకు అందుబాటులో ఉండటం ద్వారా వారితో సన్నిహిత అనుబంధాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు.

**పేదలు.. సామాన్యుల కోసం**

పేదలు, సామాన్యులు, బడుగు బలహీన వర్గాల సమస్యలపై స్పందిస్తూ వారికి అండగా నిలిచేందుకు విశ్వప్రసాద్‌రావు కృషి చేశారని అభిమానులు తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం, అవసరమైన సందర్భాల్లో వారి తరఫున స్పందించడం, సామాజిక కార్యక్రమాలకు సహకరించడం వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

**పదవి కాదు.. ప్రజలే ముఖ్యం**

రాజకీయ పదవులు ఉన్నా లేకున్నా ప్రజలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ ప్రజా జీవితంలో తన పాత్రను కొనసాగిస్తున్నారని అభిమానులు చెబుతున్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడం, అందుబాటులో ఉండటం, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ఆయనకు ప్రజలతో ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నారు.

**నిండు నూరేళ్లు జీవించాలి**

నేడు జన్మదిన వేడుకల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో శుభాకాంక్షలు తెలియజేయనున్నారు. విశ్వప్రసాద్‌రావు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని వారు ఆకాంక్షిస్తున్నారు. భవిష్యత్తులోనూ ప్రజా సమస్యల పరిష్కారానికి మరింతగా కృషి చేయాలని కోరుతున్నారు. జన్మదినం సందర్భంగా జిల్లావ్యాప్తంగా అభిమానులు, పార్టీ శ్రేణుల మధ్య సందడి నెలకొంది.వారు పేర్కొన్నారు

# నస్పూర్‌లో పోషణ్ పక్వాడ, ఆయుర్వేదిక్ క్యాంప్, యోగా మెడిటేషన్ కార్యక్రమాలు

### పోషకాహారంతో ఆరోగ్యకరమైన ఎదుగుదల.. యోగాతో మానసిక ప్రశాంతత

### విద్యార్థులకు పోషణ, యోగా ప్రాధాన్యతపై అవగాహన




**మంచిర్యాల, 21,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల డిస్ట్రిక్ట్ క్యాంపులో భాగంగా నస్పూర్ గ్రామంలో సోమవారం పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. నస్పూర్‌లోని అంగన్వాడీ కేంద్రం వద్ద పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పిల్లలకు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అలాగే నస్పూర్ మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఆయుర్వేదిక్ క్యాంప్ నిర్వహించారు. అనంతరం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు యోగా, మెడిటేషన్ కార్యక్రమం నిర్వహించి ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, జీవనశైలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోషణ్ పక్వాడ కార్యక్రమంలో విద్యార్థులు, చిన్నారు లు ప్రతిరోజూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల్య మైన పోషకాహారం ఎంతో అవసరమని, చిన్ననాటి నుంచే ఆరోగ్య కరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించుకోవాలని తెలిపారు. జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన యోగా, మెడిటేషన్ కార్యక్రమంలో యోగా ఇన్‌స్పెక్టర్ ఏ. సుధాకర్ విద్యార్థులకు యోగా ప్రాధాన్యతను వివరించారు. ప్రతిరోజూ యోగాను నిత్య కార్యక్రమం గా అలవాటు చేసుకోవడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను పొందవచ్చని తెలిపారు. విద్యార్థుల్లో చదువుపై ఏకాగ్రత పెంచుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం ఎంతగానో దోహదపడతాయని వివరించారు. యోగా ద్వారా నైతిక విలువలను పెంపొందించుకోవడంతో పాటు జీవనశైలిలో సానుకూల మార్పులు తీసుకురావచ్చని, ప్రశాంతమైన జీవన విధానం, మంచి నడవడిక, లక్ష్యసాధనకు యోగా తోడ్పడుతుందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతిరోజూ కొంత సమయాన్ని యోగా, ధ్యానానికి కేటాయించి నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో నస్పూర్ ఇన్‌చార్జ్ డాక్టర్ నీరజ, డాక్టర్ సంజయ్ కుమార్, డాక్టర్ శ్రీదేవి, నస్పూర్ ఫార్మసిస్ట్ లక్ష్మణ్, యోగా ఇన్‌స్పెక్టర్లు ఏ. సుధాకర్, మేఘన, ముజఫర్, చెన్నూరు ఎంఎన్ఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు మెటీరియల్ కొరత సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**అవసరమైన డ్రిల్ రాడ్లు, డ్రిల్ బిట్లు, రెజిన్ క్యాప్సిల్స్, సేఫ్టీ షూస్ తదితర మెటీరియల్స్ తక్షణమే అందించాలి**

**ఏఐటీయూసీ నాయకులు డిమాండ్**







**మంచిర్యాల, 21, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి గనుల్లో కార్మికులకు అవసరమైన మెటీరియల్స్ కొరత సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికులకు అవసరమైన డ్రిల్ రాడ్లు, డ్రిల్ బిట్లు, రెజిన్ క్యాప్సిల్స్, సేఫ్టీ షూస్, గ్లౌజెస్, ట్రాక్ లైన్ నిర్వహణ పరికరాలు తదితర మెటీరియల్స్‌ను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ ఆయా గనుల మేనేజర్లకు మెమోరాండాలు అందజేశారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-ఎన్‌టీ గనిలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కందికట్ల వీరభద్రయ్య, ఐకే-1ఏ గనిలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ముస్కె సమ్మయ్య, ఎస్ఆర్‌పీ-3 గనిలో బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, ఆర్కే-7 గనిలో వైస్ ప్రెసిడెంట్ కొట్టె కిషన్ రావు, ఎస్ఆర్‌పీ-1 గనిలో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మోత్కూరి కొమురయ్య పాల్గొని ఆయా గనుల మేనేజర్లకు మెమోరాండాలు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులు ప్రతిరోజూ తీవ్ర పరిస్థితుల్లో పనిచేస్తూ ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు తమ శక్తిమేరకు కృషి చేస్తున్నప్పటికీ, వారికి అవసరమైన పని సామగ్రిని సకాలంలో అందించకపోవడం వల్ల ఉత్పత్తితో పాటు కార్మికుల భద్రత కూడా ప్రభావితమవుతోందని అన్నారు. డ్రిల్ రాడ్లు, డ్రిల్ బిట్లు గత కొన్ని నెలలుగా సకాలంలో అందకపోవడంతో ఉత్పత్తి పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని, కొన్ని చోట్ల రీకండిషన్ డ్రిల్ బిట్లను ఉపయోగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కార్మికులు ఇబ్బందులను అధిగమిస్తూ 100 శాతం ఉత్పత్తి సాధించేందుకు కృషి చేస్తున్నారని, అయితే అవసరమైన మెటీరియల్స్ అందించడంలో యాజమాన్యం జాప్యం చేయడం సరికాదన్నారు. సపోర్ట్ మెన్‌కు అవసరమైన రెజిన్ క్యాప్సిల్స్‌ను తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. రూఫ్ బోల్టింగ్ పనులకు అవసరమైన రెజిన్ క్యాప్సిల్స్ అందుబాటులో లేకపోతే గని భద్రతా చర్యలకు ఆటంకం కలుగుతుందని, రూఫ్ సపోర్ట్ పనులు ఎక్కడా నిలిచిపోకుండా యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా లైన్మెన్‌కు అవసరమైన కిలలను వెంటనే అందించాలని అన్నారు. ట్రాక్ లైన్లు సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల టబ్బులు కిందపడే ప్రమాదం ఉండటంతో పాటు ఉత్పత్తి పనులకు ఆటంకం కలుగుతోందని తెలిపారు. ట్రాక్ లైన్ల నిర్వహణకు అవసరమైన పరికరాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్మికులకు జూన్, జూలై నెలల్లో అందాల్సిన సేఫ్టీ షూస్ సెప్టెంబర్ వచ్చినా అందకపోవడం తీవ్ర ఆందోళనకరమని నాయకులు అన్నారు. కార్మికుల భద్రతపై ప్రకటనలు చేయడం మాత్రమే కాకుండా, భద్రతకు అవసరమైన పరికరాలను సకాలంలో అందించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న సేఫ్టీ షూస్‌ను వెంటనే తెప్పించి కార్మికులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు నాణ్యమైన గ్లౌజెస్, ఎస్‌డీఎల్‌లకు అవసరమైన నాణ్యమైన ఆయిల్, గిరిమీట్లు తదితర అవసరమైన మెటీరియల్స్‌ను తక్షణమే సరఫరా చేయాలని కోరారు. కార్మికులకు ఇవ్వాల్సిన నూతన రంగుతో కూడిన ఒకే రకం యూనిఫామ్‌ను అన్ని గనుల కార్మికులకు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల ప్రాణాలు, ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఏఐటీయూసీ సహించబోదని నాయకులు స్పష్టం చేశారు. ఉత్పత్తి లక్ష్యాలపై చూపుతున్న శ్రద్ధను కార్మికుల భద్రత, అవసరమైన మెటీరియల్స్ సరఫరాపై కూడా యాజమాన్యం చూపాలని అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని గనుల్లో కార్మికులకు అవసరమైన అన్ని మెటీరియల్స్‌ను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై యాజమాన్యం వెంటనే స్పందించి పరిష్కారం చూపకపోతే, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ఆందోళన, ధర్నా, ముట్టడి కార్యక్రమాలను చేపట్టాల్సి వస్తుందని నాయకులు హెచ్చరించారు. కార్మికుల హక్కులు, భద్రత, పని పరిస్థితుల విషయంలో ఏఐటీయూసీ రాజీపడబోదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ బేరర్స్, అన్ని గనుల ఫిట్ సెక్రెటరీలు, అన్ని కమిటీల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా బీసీ నాయకుల రక్తదానం

**నిస్వార్థ ఉద్యమకారుడి సేవలను స్మరించుకోవడం మన బాధ్యత**

**ఒక జిల్లాకు బాపూజీ పేరు పెట్టాలి.. పాఠ్యాంశాల్లో జీవిత చరిత్ర చేర్చాలి**

**కేంద్రం భారతరత్న ప్రకటించాలి బీసీ నాయకుల డిమాండ్**

**మంచిర్యాల, 21, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** స్వాతంత్ర్య ఉద్యమం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం వరకు ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలను స్మరించుకుంటూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బీసీ నాయకులు రక్తదానం చేశారు. మంచిర్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న జనని వాలంటరీ బ్లడ్ బ్యాంకులో సోమవారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకుని ఈ రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ, కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ తొలి దశ, మలిదశ ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించిన నిస్వార్థ ఉద్యమకారుడని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదులుకున్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడి జైలుకు వెళ్లిన ఆయన, తన జీవితమంతా ప్రజా ఉద్యమాలకే అంకితం చేశారని తెలిపారు. తన 97వ ఏట సైతం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరాహార దీక్ష చేపట్టి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చిన ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని గుర్తుచేశారు. ఉద్యమాల కోసం తన ఆస్తులను సైతం దారాదత్తం చేసిన గొప్ప




సంఘసంస్కర్తగా ఆయనను పేర్కొన్నారు. రాష్ట్రంలో తొలి బీసీ సంఘాన్ని ఏర్పాటు చేసి బీసీల రాజ్యాధికార ఆవశ్యకతను చాటిచెప్పిన బీసీ ముద్దుబిడ్డగా బాపూజీ సేవలను కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీకి రాష్ట్ర ప్రభుత్వం సముచిత గౌరవం కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఏదైనా ఒక జిల్లాకు ఆయన పేరు పెట్టాలని, పాఠ్యాంశాల్లో ఆయన జీవిత చరిత్రను చేర్చి భావితరాలకు ఆయన పోరాట స్ఫూర్తిని అందించాలని కోరారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు వేముల అశోక్,



దేవసాని నాగరాజు తదితరులు పాల్గొని రక్తదానం చేశారు.

# చెక్కుపై సంతకం చేయకుండా పర్సంటేజీ అడుగుతున్నారంటూ ఆరోపణ

## పనులు పూర్తయినా బిల్లుల కోసం నెలల తరబడి ఎదురుచూపులు

## అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారం కావడం లేదంటున్న కాంట్రాక్టర్ అనిల్





**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 21 (ప్రజాజ్యోతి):**వాంకిడి: మండలంలోని ఆకిని పరిధిలో రహదారి అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపులకు సంబంధించిన చెక్కుపై ఉప సర్పంచ్ సంతకం చేయకుండా పర్సంటేజీ అడుగుతున్నారని కాంట్రాక్టర్ మండోకర్ అనిల్ ఆరోపించారు. తాను నిబంధనల ప్రకారం పనులు చేపట్టి పూర్తి చేసినప్పటికీ, చెల్లింపులు పొందేందుకు రోజుల తరబడి, నెలల తరబడి తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి అభివృద్ధి పనులు చేపట్టే సమయంలో అవసరమైన సామగ్రి, కూలీల ఖర్చులు, రవాణా తదితర వ్యయాలను ముందుగానే భరించి పనులు పూర్తి చేశామని అనిల్ తెలిపారు. పనులు పూర్తయిన అనంతరం బిల్లులు చెల్లించాల్సి ఉండగా, సంబంధిత చెక్కు ప్రక్రియలో ఉప సర్పంచ్ సంతకం అవసరమవుతోందని పేర్కొన్నారు. అయితే సంతకం చేయకుండా పర్సంటేజీ ఇవ్వాలని అడుగుతున్నారంటూ ఆయన ఆరోపించారు.

### నెలల తరబడి తిరుగుతున్నా ఫలితం లేదని ఆవేదన

పనులు పూర్తి చేసి బిల్లుల కోసం గ్రామపంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదని అనిల్ అన్నారు. ఒకసారి, రెండుసార్లు కాకుండా పలుమార్లు సంబంధిత వ్యక్తులను సంప్రదించినా స్పష్టమైన పరిష్కారం లభించలేదని తెలిపారు. చేసిన పనికి సంబంధించిన డబ్బులు అందకపోవడంతో తాను ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేసిన తర్వాత బిల్లుల కోసం ఇలా తిరగాల్సి వస్తే పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రాని పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించిన చెల్లింపులు నిబంధనల ప్రకారం సకాలంలో జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

### వాస్తవాలు వెలుగులోకి తేవాలని డిమాండ్

చెక్కుపై సంతకం ఎందుకు చేయడం లేదనే అంశంపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టాలని అనిల్ కోరారు. పర్సంటేజీ డిమాండ్ చేసినట్లు తాను చేస్తున్న ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. తాను చేసిన పనులకు న్యాయబద్ధంగా రావాల్సిన బిల్లులు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని, కాంట్రాక్టర్లు అనవసరంగా ఇబ్బందులు పడకుండా పారదర్శకంగా బిల్లుల చెల్లింపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి న్యాయం చేయాలని కాంట్రాక్టర్ మండోకర్ అనిల్ విజ్ఞప్తి చేశారు. ఉప సర్పంచ్ వివరణ: కాంట్రాక్టర్ మండోకర్ అనిల్ చేసిన ఆరోపణలపై ఉప సర్పంచ్ వివరణ తెలియాల్సి ఉంది. సంబంధిత అధికారులు విచారణ చేపడితే ఆరోపణల వాస్తవ పరిస్థితి స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# "ప్రజావాణి " దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

## దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్







**మంచిర్యాల, 21,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** ప్రజావాణి కార్యక్రమం లో ప్రజల నుంచి అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీలతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా నెన్నెల మండలం నందులపల్లి గ్రామానికి చెందిన ఇందూరి నాగయ్య తన కుమారుడు తన భూమిలోకి రాకుండా అడ్డుకుంటూ భయపెడుతున్నాడని, ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 5వ వార్డుకు చెందిన గుర్రం అంకమ్మ తాను చుట్టూ రేకులతో తాత్కాలిక ఇల్లు ఏర్పాటు చేసుకొని నివసిస్తున్నానని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. లక్షెట్టిపేట మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కల్లు సునీత తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరై బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం పూర్తయిందని, ఇందుకు సంబంధించిన బిల్లు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నెన్నెల మండలం గన్‌పూర్ గ్రామానికి చెందిన కొట్టే అశోక్ తన తండ్రి పేరిట ఉన్న భూమి నిషేధిత జాబితాలో ఉందని, రికార్డుల ప్రకారం భూమిని సవరించాలని కోరారు. జన్నారం మండలం కవ్వాల్ గ్రామ సర్పంచ్ తమ గ్రామపంచాయతీలో స్థానికంగా నివాసం లేని కొంతమంది వ్యక్తులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిపై తగు విచారణ జరిపి ఓటరు జాబితా ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండల కేంద్రానికి చెందిన జి. శైలజ తాను కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఫిజిక్స్ గెస్ట్ టీచర్‌గా విధులు నిర్వహించానని, తనకు రావాల్సిన వేతనాన్ని ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్జీదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు.

# చెక్కుపై సంతకం చేయకుండా పర్సంటేజీ అడుగుతున్నారంటూ ప్రజావాణిలో ఫిర్యాదు

**పనులు పూర్తయినా బిల్లుల కోసం నెలల తరబడి ఎదురుచూపులు**

**ఎంపీడీఓ పాటిల్ జ్యోష్ణకు దరఖాస్తు సమర్పించిన కాంట్రాక్టర్ మండోకర్ అనిల్**

**ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు తేల్చాలని విజ్ఞప్తి**

**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 21 (ప్రజాజ్యోతి):వాంకిడి:** మండలంలోని ఆకిని పరిధిలో చేపట్టిన రహదారి అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని కాంట్రాక్టర్ మండోకర్ అనిల్ ఆరోపించారు. తాను నిబంధనల ప్రకారం పనులు చేపట్టి పూర్తిచేసినప్పటికీ, తనకు రావాల్సిన బిల్లుల చెల్లింపునకు సంబంధించిన చెక్కుపై ఉప సర్పంచ్ సంతకం చేయడం లేదని, సంతకం చేయాలంటే పర్సంటేజీ ఇవ్వాలని అడుగుతున్నారంటూ ఆరోపించారు. ఈ విషయంపై సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వాంకిడి ఎంపీడీఓ పాటిల్ జ్యోష్ణకు అనిల్ లిఖితపూర్వకంగా దరఖాస్తు సమర్పించారు. తాను చేపట్టిన రహదారి అభివృద్ధి పనులను నిర్దేశించిన విధంగా పూర్తి చేశానని అనిల్ తెలిపారు. పనులు చేపట్టే సమయంలో అవసరమైన సామగ్రి కొనుగోలు, కూలీల చెల్లింపులు, వాహనాల రవాణా, ఇతర నిర్వహణ ఖర్చులను ముందుగానే భరించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పనులు పూర్తయిన అనంతరం సంబంధిత ప్రక్రియ ప్రకారం బిల్లులు మంజూరు కావాల్సి ఉన్నప్పటికీ, చెల్లింపుల విషయంలో జాప్యం జరుగుతోందని తెలిపారు.

**బిల్లుల కోసం నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా...**

పనులు పూర్తయిన తర్వాత తనకు రావాల్సిన బిల్లుల కోసం పలుమార్లు సంబంధిత కార్యాలయాలను సంప్రదించినట్లు అనిల్ తెలిపారు. ఒకసారి, రెండుసార్లు కాకుండా అనేకసార్లు తిరిగినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన పనికి సంబంధించిన నగదు అందకపోవడంతో పనుల కోసం పెట్టుబడిగా పెట్టిన డబ్బులు తిరిగి రాక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని తెలిపారు. అభివృద్ధి పనులు చేపట్టే కాంట్రాక్టర్లు పనులు పూర్తిచేసిన తర్వాత బిల్లుల కోసం నెలల తరబడి తిరగాల్సిన పరిస్థితి ఉంటే, భవిష్యత్తులో ప్రభుత్వ అభివృద్ధి పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడానికి ఇబ్బందులు ఏర్పడతాయని అనిల్ పేర్కొన్నారు. పనులు పూర్తయిన వెంటనే సంబంధిత రికార్డులు, కొలతలు, బిల్లులు పరిశీలించి నిబంధనల ప్రకారం చెల్లింపులు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

**ప్రజావాణిలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు**

తన సమస్యకు స్థానిక స్థాయిలో పరిష్కారం లభించకపోవడంతో ప్రజావాణిని ఆశ్రయించినట్లు అనిల్ తెలిపారు. ఎంపీడీఓ పాటిల్ జ్యోష్ణను కలిసి తన సమస్యను వివరించడంతో పాటు లిఖిత పూర్వకంగా దరఖాస్తు అందజేసినట్లు పేర్కొన్నారు. తనకు రావాల్సిన బిల్లుల చెల్లింపు ప్రక్రియను పరిశీలించి, జాప్యానికి కారణాలను గుర్తించాలని దరఖాస్తులో కోరినట్లు తెలిపారు. అదేవిధంగా చెక్కుపై సంతకం చేయకుండా పర్సంటేజీ డిమాండ్ చేస్తున్నారనే తన ఆరోపణలపై కూడా అధికారులు విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. సంబంధిత వ్యక్తుల వాదనలు, గ్రామపంచాయతీ రికార్డులు, పనులకు సంబంధించిన పత్రాలు, బిల్లులు, చెక్కు వివరాలు తదితర అంశాలను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని కోరారు.



**రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి**

తాను ఎలాంటి నిబంధనలను ఉల్లంఘించకుండా పనులు పూర్తిచేశానని అనిల్ తెలిపారు. తనకు న్యాయబద్ధంగా రావాల్సిన బిల్లులు మాత్రమే కోరుతున్నానని పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపు విషయంలో ఎవరి వల్ల జాప్యం జరుగుతోంది? చెక్కుపై సంతకం ఎందుకు చేయడం లేదు? పర్సంటేజీ డిమాండ్ చేశారనే ఆరోపణల్లో వాస్తవమెంత? అనే విషయాలపై అధికారులు సమగ్రంగా విచారణ జరపాలని కోరారు. ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన చెల్లింపుల్లో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా



పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. కాంట్రాక్టర్లు చేసిన పనులకు సంబంధించిన బిల్లులను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత ఉంటే సకాలంలో చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి**

ప్రజావాణిలో సమర్పించిన తన దరఖాస్తును అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అనిల్ కోరారు. సమస్యను కేవలం స్థానిక స్థాయిలోనే పరిమితం చేయకుండా అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల విషయంలో కాంట్రాక్టర్లు అనవసర ఇబ్బందులు ఎదుర్కోకుండా స్పష్టమైన విధానం అమలు చేయాలని కోరారు. తన ఫిర్యాదుపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, తనకు రావాల్సిన బిల్లులను నిబంధనల ప్రకారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అనిల్ కోరారు. ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదుపై అధికారులు తీసుకునే చర్యలపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది. ఉప సర్పంచ్ వివరణ: కాంట్రాక్టర్ మండోకర్ అనిల్ చేసిన పర్సంటేజీ డిమాండ్, చెక్కుపై సంతకం చేయడం లేదన్న ఆరోపణలపై ఉప సర్పంచ్ వివరణ తెలియాల్సి ఉంది. సంబంధిత అధికారులు విచారణ చేపట్టి ఇరుపక్షాల వాదనలు, పంచాయతీ రికార్డులు, పనులకు సంబంధించిన పత్రాలను పరిశీలించిన అనంతరం వాస్తవ పరిస్థితి స్పష్టమయ్యే అవకాశం ఉంది.

## జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అదనపు ఎక్స్‌రే మిషన్ ఏర్పాటు చేయాలి

**ఒక్క ఎక్స్‌రే మిషన్‌తో రోగులకు తీవ్ర ఇబ్బందులు**

**పేద రోగులపై ప్రైవేట్ వైద్య ఖర్చుల భారం తగ్గించాలి**

**మంచిర్యాల జిల్లా, ప్రజల తరపున విజ్ఞప్తి**

**మంచిర్యాల, 21,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో పేద, మధ్యతరగతి ప్రజలు వైద్యం కోసం వస్తున్నారు. అయితే ఇంత పెద్ద సంఖ్యలో రోగులు వచ్చే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతం ఒక్కటే ఎక్స్‌రే మిషన్ ఉండటం, ఎక్స్‌రే టెక్నీషియన్ కూడా ఒక్కరే ఉండటంతో రోగులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది చెన్నూర్ 16వ వార్డు కౌన్సిలర్ ముత్యాల రాజేశ్వరి--రవి ఆవేదన వ్యక్తం చేశారు అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చే రోగులకు కూడా సమయానికి ఎక్స్‌రే సేవలు అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పేద ప్రజలు ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లను ఆశ్రయించాల్సి వస్తే అదనపు ఆర్థిక భారం పడుతోందని తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి జిల్లాలోని పేద ప్రజలకు ప్రధాన ఆధారంగా ఉందని, అక్కడ వైద్య సౌకర్యాలను పెంచడం ప్రజల ఆరోగ్యం, ప్రాణాలకు సంబంధించిన ముఖ్యమైన అంశమని, ఈ నేపథ్యంలో చెన్నూర్ మంచిర్యాల శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి 3ఎ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, ఆసుపత్రిలో అదనంగా ఎక్స్‌రే మిషన్ ఏర్పాటు చేయడంతో పాటు అవసరానికి అనుగుణంగా మరిన్ని ఎక్స్‌రే టెక్నీషియన్లను నియమించాలని కోరారు. అదేవిధంగా రోగుల రద్దీకి అనుగుణంగా డయాగ్నస్టిక్ సౌకర్యాలను పెంచి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆధునిక వైద్య సౌకర్యాలతో మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి పేద రోగికి మెరుగైన వైద్య సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు ."ప్రజల ఆరోగ్యం -- ప్రభుత్వ బాధ్యత" అనే భావనతో ఈ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని మంచిర్యాల జిల్లా ప్రజల తరపున ముత్యాల రాజేశ్వరి--రవి, చెన్నూర్ 16వ వార్డు కౌన్సిలర్ విజ్ఞప్తి చేశారు.





# వినాయక నిమజ్జన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సీపీ సమన్వయ సమావేశం

**ప్రశాంతంగా, సురక్షితంగా నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించాలి**
**సీపీ అంబర్ కిశోర్ ఝా**
**గతేడాది సమస్యలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి**
**అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**





**మంచిర్యాల, 21,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్, సింగరేణి, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, వైద్య ఆరోగ్య, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక, ఫిషరీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. వినాయక నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై సీపీ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ, వినాయక నిమజ్జన కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగే నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. గత సంవత్సరం నిమజ్జనం సందర్భంగా ఎదురైన సమస్యలు, ఇబ్బందులు, లోపాలను సమీక్షించి, అవే సమస్యలు ఈ సంవత్సరం పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రదేశాలు, శోభాయాత్ర మార్గాలు, రద్దీ ప్రాంతాలు, పార్కింగ్ ప్రదేశాలను ముందుగానే పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఫిషరీస్, సంబంధిత శాఖల అధికారులు నిమజ్జన ప్రదేశాల్లో నీటి లోతు, ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రమాదాల నివారణకు రక్షణ సిబ్బంది, శిక్షణ పొందిన ఈతగాళ్లు, రెస్క్యూ బృందాలు, అవసరమైన రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారులు నిమజ్జన ప్రదేశాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, లైటింగ్, రోడ్ల పరిస్థితి, పార్కింగ్ తదితర ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు నిమజ్జన మార్గాలు, మండపాలు, నిమజ్జన ప్రదేశాల్లో విద్యుత్ వైర్లు, స్తంభాలు, తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లను ముందుగానే పరిశీలించి, ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ అధికారులు అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఫైర్ టెండర్లు, సిబ్బంది, రక్షణ పరికరాలను కీలక ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచాలని తెలిపారు. సింగరేణి అధికారులు తమ పరిధిలోని నిమజ్జన మార్గాలు, రహదారులు, సంబంధిత ప్రాంతాల్లో అవసరమైన సహకారం అందించాలని, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ అధికారులు నిమజ్జన శోభాయాత్ర మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ, రద్దీ నిర్వహణ, బందోబస్తు, పార్కింగ్, క్రేన్లు, ఇతర అత్యవసర సేవల సమన్వయంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీపీ ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్, ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం సీఐ కృష్ణకుమార్, గోదావరిఖని 2 టౌన్ సీఐ ప్రసాద్ రావు, జైపూర్ సీఐ నవీన్ కుమార్, ఎస్ఐ భూమేష్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు

# బెల్లంపల్లి ఏరియాలో జనరల్ అసిస్టెంట్ (సర్వీస్) పోస్టులకు ఎస్‌సీసీఎల్ దరఖాస్తుల ఆహ్వానం

**మంచిర్యాల, 21,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) బీపీఏ ఏరియాలోని ఓసీ మైన్స్, సీఎచ్‌పీలు, ఇతర విభాగాల్లో గుర్తించిన జనరల్ అసిస్టెంట్ (సర్వీస్), కేటగిరీ--1 ఖాళీలను భర్తీ చేసేందుకు అర్హులైన ఉద్యోగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు ఎస్‌సీసీఎల్ ప్రధాన కార్యాలయం కొత్తగూడెం నుంచి రిఫరెన్స్ నంబర్ సిఆర్ పి /పర్సనల్ /పిఎం /3932/1882, తేదీ 18-09-2026తో సర్క్యులర్ జారీ చేసింది. ఈ సర్క్యులర్ ప్రకారం వివిధ ఏరియాల్లో పనిచేస్తున్న జనరల్ అసిస్టెంట్లు (అండర్‌గ్రౌండ్), ఇతర టైమ్ రేటెడ్ ఉద్యోగులు (యూజీ) బీపీఏ ఏరియాలో జనరల్ అసిస్టెంట్ (సర్వీస్), తగ్గించబడిన కేటగిరీ--1లో బేసిక్ పే, గ్రేడ్/కేటగిరీ రక్షణ లేకుండా పనిచేయడానికి అంగీకరిస్తే దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఎంవీ డ్రైవర్లు, ట్రేడ్స్‌మెన్, సూపర్‌వైజరీ స్టాఫ్ (మైనింగ్/ఈఅండ్ఎం), సెక్యూరిటీ పర్సనల్, వార్డ్ అసిస్టెంట్లు తదితరులు ఈ పరిధిలోకి రారు. ఉద్యోగుల ఎంపిక, బదిలీ కంపెనీలో వారి ప్రారంభ నియామక తేదీ ఆధారంగా సీనియారిటీ ప్రాతిపదికన పరిగణనలోకి తీసుకోనున్నారు. కంపెనీలో నియమితులైన తేదీ నుంచి అండర్‌గ్రౌండ్ గనుల్లో కనీసం ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసి ఉండటం తప్పనిసరి. ఉద్యోగుల ప్రారంభ నియామక తేదీ నుంచి ప్రస్తుత గ్రేడ్/కేటగిరీకి పదోన్నతి పొందిన తేదీ వరకు ఉన్న సర్వీస్ వివరాలను సంబంధిత ఆఫీస్ ఆర్డర్లతో క్షుణ్ణంగా ధృవీకరించి ప్రత్యేక షీట్‌లో సమర్పించాల్సి ఉంటుంది. ఈ సర్క్యులర్ జారీకి ముందు సంబంధిత కేడర్ల ఉద్యోగులు సమర్పించిన పాత దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోరు. బీపీఏ ఏరియాకు వెళ్లాలనుకునే వారు ఈ సర్క్యులర్‌కు అనుగుణంగా కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. విజిలెన్స్ కారణాలతో ఏరియాలకు బదిలీ అయిన ఉద్యోగుల అభ్యర్థనలను వారి బదిలీ తేదీ నుంచి మూడేళ్ల వరకు ముందుకు పంపాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అలాగే క్రమశిక్షణా చర్యలు పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల దరఖాస్తులను కూడా ఫార్వర్డ్ చేయరాదు. బీపీఏ ఏరియాకు బదిలీ అయిన ఉద్యోగులు తమకు కేటాయించిన పోస్టింగ్ ప్రదేశంలో రిపోర్ట్ చేసి ఐదేళ్లపాటు అక్కడ కొనసాగాల్సి ఉంటుంది. ఆ కాలంలో మరో ఏరియాకు బదిలీ కోరుతూ చేసే తదుపరి అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోరు. తగ్గించబడిన కేటగిరీ--1లో జనరల్ అసిస్టెంట్ (సర్వీస్)గా నియమితులైన అండర్‌గ్రౌండ్ ఉద్యోగులు కూడా బీపీఏ ఏరియాలో ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన తర్వాతే ఇతర ఏరియాకు బదిలీ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. ఉద్యోగుల దరఖాస్తులను ఉత్తర్వులు జారీ చేసే సమయంలో యాజమాన్య అవసరాలు, ప్రాంతీయ సీనియారిటీ ప్రమాణాల ఆధారంగా పూర్తిగా లేదా పాక్షికంగా పరిగణనలోకి తీసుకునే అధికారం యాజమాన్యానికి ఉంటుంది. ఈ విషయంలో ఎలాంటి వినతులను స్వీకరించబోమని సర్క్యులర్‌లో స్పష్టం చేశారు. అదేవిధంగా, ఉద్యోగుల సొంత అభ్యర్థన మేరకు ఈ బదిలీలు జరుగుతున్నందున సెటిలింగ్-ఇన్ అలవెన్స్ తదితర సాధారణ బదిలీ రాయితీలు వర్తించవు. ఆసక్తి ఉన్న ఉద్యోగులు తమ పూర్తి సర్వీస్ వివరాలతో కూడిన దరఖాస్తులను 05-10-2026లోపు సంబంధిత కార్యాలయానికి చేరేలా పంపించాలి. ఇతర ప్రాంతాలకు బదిలీ కోసం సమర్పించిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోరు. నిర్దేశిత అర్హతలు లేకుండా లేదా గడువు తేదీ తర్వాత అందిన దరఖాస్తులను తక్షణమే తిరస్కరిస్తామని యాజమాన్యం పేర్కొంది. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్ని ఏరియా జనరల్ మేనేజర్లను ఆదేశిస్తూ జీఎం (పర్సనల్), ఐఆర్ అండ్ పీఎం ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు.

# సింగరేణి కార్మికుల గుండెల్లో చిరస్మరణీయుడు అమరజీవి నర్సయ్య

**సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ,సిపిఐ నాయకులు**

**శ్రీరాంపూర్ లో ఘనంగా సింగరేణి కార్మిక ఉద్యమ నేత అమరజీవి కామ్రేడ్ పుచ్చకాయల నరసయ్య 32వ వర్ధంతి**

**మంచిర్యాల, 21,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కార్మిక ఉద్యమ నేత అమరజీవి కామ్రేడ్ పుచ్చకాయల నరసయ్య 32వ వర్ధంతి సందర్భంగా సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ లో ఆయన స్మారకార్థం నిర్మించిన స్మారక స్తూపాన్ని రీనోవేషన్ చేసి పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ సెక్రటరీ ఎస్కే బాజీ సైదా, సీపీఐ జిల్లా కార్యదర్శి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల హృదయాల్లో అమరజీవి నరసయ్య చిరస్మరణీయుడని అన్నారు. నిత్యం కార్మిక వర్గ శ్రేయస్సు కోసం పరితపిస్తూ, నిస్వార్థంగా కార్మికులకు సేవ చేసిన నాయకుడని కొనియాడారు. బదిలీ వర్కర్ కార్మికులకు ఆయన చేసిన పోరాటం చారిత్రాత్మకమని తెలిపారు . ఒకప్పుడు 190 మస్టర్లు నిండని బదిలీ పిల్లర్ కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినా వారి కుటుంబాలకు డిపెండెంట్ ఉద్యోగం కల్పించే హక్కు ఉండేది కాదని తెలిపారు. 1990లో ఎస్ఆర్పీ-1లో బదిలీ పిల్లర్ కార్మికుడైన ఆలేటి శంకరయ్య గని ప్రమాదంలో మృతి చెందగా, ఆయన కుటుంబానికి డిపెండెంట్ ఉద్యోగం ఇవ్వాలని నరసయ్య డిమాండ్ చేశారని గుర్తుచేశారు. అయితే యాజమాన్యం అందుకు అంగీకరించకుండా బదిలీ కోల్ పిల్లర్ కార్మికులకు డిపెండెంట్ ఉద్యోగం ఇచ్చే హక్కు లేదని చెప్పడంతో, నరసయ్య సమ్మె నిర్వహించడంతో పాటు హైకోర్టులో కేసు వేశారని తెలిపారు. చివరకు బదిలీ కోల్ పిల్లర్ కార్మికులకు డిపెండెంట్ ఉద్యోగం హక్కు కల్పించేలా పోరాటం విజయవంతమైందన్నారు. అలాగే 190 మస్టర్లు నిండితేనే పర్మినెంట్ అనే నిబంధనతో సంబంధం లేకుండా కార్మికులకు ఇంక్రిమెంట్ అమలు చేయించారని పేర్కొన్నారు. ఉమ్మడి తాళ్లపల్లి మేజర్ గ్రామపంచాయతీకి భారత కమ్యూనిస్టు పార్టీ నుంచి సర్పంచ్గా ఎన్నికై, కార్మికులు నివాసం ఉండేలా ఆర్కే-6, అరుణక్కనగర్, సంగమల్లయ్యపల్లె తదితర ప్రాంతాల్లో గుడిసెలు వేయించి, వారికి యాజమాన్యం ద్వారా మౌలిక వసతులు కల్పించేలా పోరాటాలు నిర్వహించారని తెలిపారు. విద్యుత్, మంచినీరు తదితర సౌకర్యాలను యాజమాన్యంతో పోరాడి సాధించారని అన్నారు. ఇలా అనేక హక్కుల సమస్యలపై పోరాటాలు చేసిన నరసయ్యను కార్మికులు అమితంగా ఆదరించేవారని, ఆయన నాయకత్వంలో ఏఐటీయూసీ మరింత బలోపేతం కావడాన్ని చూసి



ఓర్వలేని కొందరు అతివాదుల చేతిలో ఆయన హత్యకు గురయ్యారని పేర్కొన్నారు. అలాంటి గొప్ప నాయకులు మన మధ్య లేకపోయినా, వారి స్ఫూర్తితో వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, వైస్ ప్రెసిడెంట్ కొట్టే కిషన్ రావు, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మోత్కూరి కొమురయ్య, సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జాయింట్ సెక్రెటరీ రాచర్ల చంద్రమోహన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, సీపీఐ జిల్లా నాయకులు, ఆఫీస్ బేరర్లు, అన్ని గనుల ఫిట్ సెక్రటరీలు, వివిధ కమిటీల నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బీసీ, పద్మశాలీయులు యశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలి



**కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో రాజ్యాధికార సాధన కోసం**

**బీసీలు, పద్మశాలీయులు పోరాటాలకు సిద్ధం కావాలి**

**మంచిర్యాల, 21,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** బీసీలు, పద్మశాలీయులు యశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక, పద్మశాలి సంఘం, బీసీ సంఘాల నాయకుడు గజెల్లి వెంకటయ్య పిలుపునిచ్చారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో బీసీలు, పద్మశాలీయులు రాజ్యాధికార సాధన కోసం ఐక్యంగా పోరాటాలు చేయాలని అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో బీసీ, శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మూడు తరాల ఉద్యమ నాయకుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, నిస్వార్థ ప్రజా సేవకుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముందు బాపూజీ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ బీసీలు, పద్మశాలీయులు యశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలని అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా రాజ్యాధికార సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ ముద్దుబిడ్డ, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ నిజాం నిరంకుశ పాలనకు, రజాకార్ల దాష్టీకానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన చేనేత జౌళి శాఖ మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదులుకొని, తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమాల్లో చివరి శ్వాస వరకు పోరాడిన బాపూజీ చిరస్మరణీయుడని కొనియాడారు. బాపూజీ స్ఫూర్తితో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మెట్పల్లి, జగిత్యాల, సిరిసిల్ల, వరంగల్, నర్సంపేట, సంగారెడ్డి, గద్వాల్ తదితర అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలను కలుపుకొని 'మేమెంతో మాకంత' అనే వాటా డిమాండ్తో పోరాడాలని అన్నారు. 2028లో జరిగే శాసనసభ ఎన్నికల్లో 10 నుంచి 15 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకొని పద్మశాలీయుల సత్తా చాటాలని, అప్పుడే బాపూజీకి నిజమైన నివాళి అర్పించినవారమవుతామని అన్నారు. అదేవిధంగా జిల్లా, రాష్ట్ర, అఖిల భారత పద్మశాలి సంఘాల నాయకులుగా చెప్పుకునే వారు ఇకనైనా అగ్రవర్ణాలు, ఆధిపత్య వర్గాల అడుగులకు మడుగులొత్తే విధానానికి స్వస్తి పలకాలని అన్నారు. పద్మశాలీయులు, బీసీల ఆత్మగౌరవం, అస్తిత్వం కోసం పాటు పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, నాయకులు జంజీరాల నారాయణ, పి. శ్రీనివాస్, సి.హెచ్. రామస్వామి, ఏ. రాజేశం, బొద్దున బాపురావు, ఎం. సత్యనారాయణ, డి. రామస్వామి, ఏ. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయురాలి డెప్యూటేషన్ రద్దు చేయాలి

వెంటనే నీంగూడ పాఠశాలకు పంపాలని కలెక్టర్‌కు గ్రామస్థుల వినతి



**ఆసిఫాబాద్ , సెప్టెంబర్ 21 ప్రజా జ్యోతి** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం నీంగూడ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)లో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు శ్రీమతి శ్యామల డెప్యూటేషన్‌ను వెంటనే రద్దు చేసి, తిరిగి అదే పాఠశాలకు పంపించాలని కోరుతూ గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఉపాధ్యాయురాలి డెప్యూటేషన్ కారణంగా పాఠశాలలో విద్యార్థుల బోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడితే విద్యార్థుల చదువుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థుల విద్యా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని డెప్యూటేషన్‌ను రద్దు చేసి, ఉపాధ్యాయురాలు శ్యామలను వెంటనే నీంగూడ పాఠశాలకు కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు.ఈ మేరకు ఆగర్వాడ సర్పంచ్ వాద్గురే రోజా సోనాజీ ఆధ్వర్యంలో గ్రామస్థులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన.. అప్రమత్తతే రక్షణ



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 21 ప్రజాజ్యోతి** మాదకద్రవ్యాల వినియోగానికి యువత దూరంగా ఉండాలని కెరమెరి పోలీసులు సూచించారు. కెరమెరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐలు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, చట్టపరమైన పరిణామాలను విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.అనంతరం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ మోసాలు, ఫిషింగ్ లింకులు, సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులకు ఓటీపీ, పాస్‌వర్డ్, పిన్, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని తెలిపారు. గుర్తుతెలియని లింకులపై క్లిక్ చేయకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు.ఎవరైనా సైబర్ మోసానికి గురైనా, అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులు స్వీకరించిన పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా




**మంచిర్యాల, 21,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రతి ఫిర్యాదుదారుతో పోలీస్ కమిషనర్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, చట్టపరంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను పోలీస్ కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ సమస్యలను నేరుగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజల సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులను నేరుగా స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్రంగా విచారణ జరిపి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్ ఎల్ ఏ జన్మదిన వేడుకలు



**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 21(ప్రజాజ్యోతి):** ఎమ్ ఎల్ ఏ ప్రేమ్ సాగర్ రావు 67 వ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణంలోని స్థానిక ఐబీ విశ్రాంత భవన్ లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి పని చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలోనే నియోజకవర్గం అభివృద్ధిలో ప్రథమ స్థానంలో దూసుకెళ్ళుతుందన్నారు. రెండున్నర ఏండ్లలో సుమారు రూ. 2 వేల కోట్లతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ముఖ్యంగా మంచిర్యాలలో సూపర్ స్పెషలిటీ హాస్పిటల్, స్మశాన వాటిక, రోడ్డు వెడల్పు పనులు, లక్షెట్టిపేటలో ప్రభుత్వ పాఠశాల, కళాశాల, 30 పడకల ఆసుపత్రి, దండేపల్లి మండలంలో ఇంటిగ్రెటెడ్ స్కూల్, హాజీపూర్ మండలంలో ఇంటర్నేషనల్ ఫిష్ పాండ్, ఐటీ పార్క్ లాంటి అనేక అభివృద్ధి జరుగుతున్నాయని వివరించారు. అదే విధంగా లక్షెట్టిపేటలోని మండల అంబేద్కర్ సంఘం భవన నిర్మాణానికి రూ. 15 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో భాగంగా రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. పాత బస్టాండ్ ఏరియాలో అన్న దానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెండా వెంకటాపూర్ పీఏసీఎస్ చైర్ పర్సన్ చెల్ల నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు షాహిద్ అలీ, నలిమేల రాజు, మున్సిపల్ చైర్ పర్సన్ దొంత అంజలి నర్సయ్య, ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, మాజీ వైస్ చైర్మన్ ఆరీఫ్, సర్పంచ్ లు దుమ్మని సత్తయ్య, రాందాస్, కౌన్సిలర్లు పద్మ రమేష్, చంద్రమౌళి, శనిగారపు చిన్నయ్య, నాయకులు అశోక్, కాంతయ్య, రాందేని వెంకటేష్, కందుల మోహన్, మడిపెల్లి స్వామి, సురేష్, శ్రీధర్, కో– ఆప్షన్ సభ్యులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కవ్వాల్ టైగర్ జోన్ తో స్థానికులకు ఉపాధి అవకాశాలు ఎఫ్ డి ఓ రామ్మోహన్






**జన్నారం,సెప్టెంబర్21(ప్రజాజ్యోతి)**కవ్వాల్ టైగర్ జోన్ వల్ల ఇక్కడి ప్రాంతం అభివృద్ధి చెందడమే గాకుండా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని జన్నారం ఎఫ్.డి.ఓ రామ్మోహన్ అన్నారు. జన్నారం మండల కేంద్రంలోని అటవీశాఖ డివిజన్ కార్యాలయంలో సోమవారం రోజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ జోన్ లో పులులు, చిరుతలు, జింకలు, రేచుకుక్కలతో సహ అన్ని జంతువులకు అవాసం కల్పించడం, మరో పక్క ప్రసిద్ద టేకు వనాల రక్షణ అమూల్యమైన అటవీ పర్యావరణ వ్యవస్థ పరిరక్షించబడుతుందని అన్నారు. మహారాష్ట్రలోని తాడోబా టైగర్ రిజర్వ్ అదే విధంగా తిప్పేశ్వర్ టైగర్ జోన్ మాదిరిగా కవ్వాల్ టైగర్ జోన్ ను అభివృద్ధి చేయడం ద్వారా పకృతి, వన్యప్రాణి పర్యాటక రంగానికి ప్రోత్సాహం లభిస్తుందని దీని వల్ల హోటల్లు, రవాణా, వ్యాపారం, అటవీ ఉత్పత్తుల గిరాకీతో పాటు సఫారి వాహనాల నిర్వహణలో స్థానికులు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. కవ్వాల్ టైగర్ జోన్ లో ప్రస్తుతం దాదాపు 130 మంది ఉద్యోగులుగా,బేస్ క్యాంపు వాచర్లుగా, ఆనిమల్ ట్రాకర్లుగా, డ్రైవర్ కంప్యూటర్ అపరేటరుగా స్థానికులు ఉపాది పొందుతున్నారని అన్నారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్‌కు సంబంధించి ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిని పది కిలోమీటర్ల నుండి ఒక కిలోమీటర్ కు తగ్గిస్తూ ప్రభుత్వానికి 6 నెలల క్రితమే ప్రతి పాదనలను పంపించడం జరిగిందని తెలిపారు.

## తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా ప్రపంచ శాంతి దినోత్సవం



**మంచిర్యాల, 21,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ శాంతి దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్--2 ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పత్తి సునిత, వైస్ ప్రిన్సిపాల్ వహీదా, చరిత్ర మరియు ఆర్థిక శాస్త్ర విభాగాధిపతులు ఎస్. సత్యరాణి, బి. నిఖితతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు ప్రపంచ శాంతి యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. హింసకు దూరంగా ఉండి, పరస్పరం గౌరవించుకుంటూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రపంచంలో శాంతి నెలకొల్పడంలో ప్రతి వ్యక్తి తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

## మస్కాపూర్ వాసి శ్రీనివాస్ కు మార్షల్ ఆర్ట్స్ కరాటేలో జాతీయ నంది అవార్డు



**ఖానాపూర్ సెప్టెంబర్ 21(ప్రజా జ్యోతి )** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని మస్కా పూర్ గ్రామానికి చెందిన చిలుకూరు శ్రీనివాస్ కు మార్షల్ ఆర్ట్స్ కరాటే పోటీల్లో నంది అవార్డు లభించింది ఆదివారము హైదరాబాద్ లోని ఎల్బీనగర్ లోని స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియం లో జరిగిన కార్యక్రమములో మార్షల్ ఆర్ట్స్ కి సంబందించిన కరాటే విభాగం లో గ్లోబల్ ఎక్షెలెన్సి ఐకాన్ అవార్డ్స్ నంది అవార్డు బహుకరణ కార్యక్రమముజరిగింది లో ఇందులో అమెచ్యూర్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అవార్డ్స్ అసోసియేషన్ ద్వారా ఎంపికైన చిలికూరి శ్రీనివాస్ కునంది అవార్డును బహూకరించారు ఈ కార్యక్రమములో కేశవ్ గౌడ్ కరాటే అకాడమి వ్యవస్థాపకులు ,అమెచ్యూర్ అవార్డు అసోసియేషన్ ఫౌండర్ అమర్ సింగ్ , శ్రీలంక నుంచి వచ్చిన ఇంటర్ నేషనల్ మాస్టర్ క్యోషి ఆర్ బాల శ్రితరన్ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా కేశవ్ గౌడ్ మాట్లాడుతూ చిలుకూరి శ్రీనివాస్ గత 28 సంవత్సరాల నుండి కరాటే ను ప్రజల్లోకి తీసుకు వెళ్ళే నేపథ్యం లో పలు జాతీయ అంతర్జాతీయ పోటీలలో పాల్గొని ఎన్నో అవార్డులు పొందడం మే కాకుండా తన శిష్యులకు కూడా జాతీయ స్థాయిలో ఆడించడం జరిగిందని తన ప్రతిభను గుర్తించి అంతర్ జాతీయ నంది అవార్డును ఇవ్వడం జరిగినదని ఈ సందర్భంగా తెలిపారు. జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ కరాటే పోటీల్లో నంది అవార్డు లభించిన చిలుకూరు శ్రీనివాస్ ను నిర్మల్ జిల్లా మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ తో పాటు ఖానాపూర్ మండల, ముస్కాపూర్ గ్రామ శ్రేయోభిలాషి బంధుమిత్రులు అభినందించారు

## ప్రజావాణి దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 21 ,( ప్రజాజ్యోతి ).**ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, ఆర్డీవో దేవీదాస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణ స్పందన

**చట్టపరంగా పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలు**

**ఎస్పీ డా. జి. జానకి షర్మిల**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 21 ,( ప్రజాజ్యోతి ).**నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను క్షుణ్ణంగా విన్న ఎస్పీ, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. ఫిర్యాదులను చట్టపరంగా పరిశీలించి, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజావాణి ద్వారా అందే ప్రతి ఫిర్యాదును బాధ్యతతో స్వీకరించి, దాని పరిష్కారానికి తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో అనవసర జాప్యం లేకుండా, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారికి పూర్తి స్థాయిలో సహకరించాలని సూచించారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీసు శాఖ దృష్టికి తీసుకువచ్చేలా ప్రజావాణి కార్యక్రమం ఉపయోగపడుతుందని ఎస్పీ తెలిపారు. ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలందిస్తూ పోలీసు శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, పేర్కొన్నారు.

## ముధోల్‌లో ప్రశాంతంగా ముగిసిన గణేష్ నిమజ్జన శోభాయాత్ర

**పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 21 ,( ప్రజాజ్యోతి ).** నిర్మల్ జిల్లాలోని ముధోల్ పట్టణంలో నిర్వహించిన గణేష్ నిమజ్జన శోభాయాత్ర సోమవారం భక్తిశ్రద్ధలు, ఉత్సాహం మధ్య ప్రశాంతంగా ముగిసింది. పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు తరలివచ్చిన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ముధోల్‌లో శోభాయాత్ర జరుగుతున్న ప్రాంతాలను స్వయంగా పరిశీలిస్తూ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. శోభాయాత్ర మార్గంలో పోలీసు సిబ్బంది విధులు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల రాకపోకలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.నిమజ్జన ఘాట్‌తో పాటు ప్రధాన కూడళ్లు, శోభాయాత్ర మార్గంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. గణేష్ మండపాల నిర్వాహకులు, భక్తులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ పోలీసులు విధులు నిర్వహించారు. ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించి నిబంధనలు పాటించడంతో శోభాయాత్ర సజావుగా కొనసాగింది. నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా పూర్తయింది.నిమజ్జన బందోబస్తులో విధులు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన ముధోల్ ప్రజలకు, గణేష్ మండపాల నిర్వాహకులకు పోలీస్ శాఖ కృతజ్ఞతలు తెలిపింది.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కుమారిలో పింఛన్ లబ్ధిదారుల పరిశీలన



**నేరడిగొండ సెప్టెంబర్ 21(ప్రజా జ్యోతి):**ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలోని కుమారి గ్రామంలో లబ్ధిదారుల అర్హతలను పరిశీలించేందుకు సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.పి రాజు, స్పెషల్ ఆఫీసర్ సతీష్ పాల్గొని గ్రామంలోని వివిధ వర్గాల పెన్షన్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. గ్రామంలో పింఛన్లు పొందుతున్న వృద్ధులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు తదితర లబ్ధిదారుల వివరాలను అధికారుల బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. పింఛన్ పొందుతున్న వారిలో అర్హులు ఎంతమంది ఉన్నారు, అనర్హులు ఎవరైనా ఉన్నారా అనే విషయాలను సామాజికంగా సమగ్రంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ పథకాలు కేవలం అర్హులైన పేదలకే అందాలనే ఉద్దేశంతోనే ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లక్ష్మణ్, ఉప సర్పంచ్ ఆడేపు రవి, పంచాయతీ సెక్రెటరీ దత్త హరి, కారోబార్ ఎన్. రాజు మరియు గ్రామ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు










**నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై కఠిన చర్యలు**

**మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి**

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, 21,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ. భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌లతో కలిసి నిర్వహించిన రహదారి భద్రత సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ పరిధిలో ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు, రోడ్డు భద్రత సూచికలు ఏర్పాటు చేయాలని, రోడ్లపై చెత్త, ఇతర ఆటంకాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ట్రాఫిక్ పోలీసులు అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తక్కువ విజిబిలిటీ ఉన్న ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, హెచ్చరికలు, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారులపై వాహనాలు నిలిపి ఉంచకుండా రహదారులు, భవనాలు, పోలీసు శాఖల ఆధ్వర్యంలో చర్యలు చేపట్టాలన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో అదుపు తప్పిన, ఓవర్‌లోడెడ్ వాహనాలు, పరిమితికి మించి వేగంగా నడిపే వాహనాలు, ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని, గ్రామీణ, అంతర్గత రహదారుల్లో కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓవర్‌లోడింగ్, మితిమీరిన వేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్లపై సంచరించే పశువులను అందుబాటులో ఉన్న గోశాలలకు తరలించాలని, నూతన గోశాల ఏర్పాటుకు భూమి కేటాయించినందున పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. రహదారి ప్రమాదాలు, మరణాలు తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. డి.సి.పి. ఎ. భాస్కర్ మాట్లాడుతూ, జిల్లాలో 2026 సంవత్సరంలో ఇప్పటివరకు 429 రోడ్డు ప్రమాదాలు జరగగా 95 మంది మృతి చెందారని తెలిపారు. ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. బెల్లంపల్లి కన్నాల ప్రాంతంలో, నస్పూర్‌లోని కలెక్టరేట్ కమాన్ ప్రాంతంలో రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి**

అనంతరం మాదకద్రవ్యాల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత మంచిర్యాల జిల్లా సాధనలో భాగంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటివరకు 63 కేసులు నమోదు కాగా 133 మందిని అరెస్టు చేశామని, 35 మందిని డ్రగ్ డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించి కౌన్సెలింగ్ అందిస్తున్నామని తెలిపారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా మాధ్యమిక విద్యాధికారి ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలల్లో అబ్నార్మల్ బిహేవియర్ ఉన్న విద్యార్థులను గుర్తించి సంబంధిత ఎస్‌హెచ్‌ఓలకు సమాచారం అందించాలని తెలిపారు. విద్యార్థులకు మాదకద్రవ్యాల నియంత్రణపై క్విజ్, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించాలని సూచించారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహించడం, పొగాకు సంబంధిత ఉత్పత్తులను విక్రయించడం నిషేధించబడినందున సంబంధిత అధికారులు పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. మెడికల్, ఐటీఐ, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలో మద్యం దుకాణాలు నిర్ణీత సమయానికి మూసివేసేలా చర్యలు తీసుకోవాలని, బెల్ట్ షాపులను నియంత్రించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గంజాయి తదితర మాదక మొక్కల సాగు చేసే వారిని గుర్తించాలని తెలిపారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో మెడికల్ షాపులను నిత్యం పర్యవేక్షించి, సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించే షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. డీ-అడిక్షన్ కేంద్రాల్లో అవసరమైన కిట్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# కులగణనలో ప్రతి కులానికి ప్రత్యేక యూనిట్ కోడ్ కేటాయించాలి

**శాస్త్రీయంగా బీసీ జనగణన నిర్వహించాలి**

**బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్**

**మంచిర్యాల, 21,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** బీసీ సమాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, కొండా లక్ష్మణ్ బాపూజీ బీసీల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి బీసీ సమాజంపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణనలో కులగణనను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలోని ప్రతి కులానికి ప్రత్యేక యూనిట్ కోడ్ కేటాయించి, కులాల వారీగా జనాభాను ఖచ్చితంగా నమోదు చేయాలని కోరారు. బీసీల జనాభా ఎంత ఉందో శాస్త్రీయంగా, పారదర్శకంగా తేల్చినప్పుడే విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాలు తదితర రంగాల్లో జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా కల్పించే అవకాశం ఉంటుందని నరెడ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. బీసీలకు సంబంధించిన గణాంకాలు కచ్చితంగా లేకపోవడం వల్ల అనేక సంవత్సరాలుగా బీసీలకు రావాల్సిన హక్కులు, అవకాశాల్లో అన్యాయం జరుగుతోందని అన్నారు. అందువల్ల రాబోయే జనగణనలో కులగణనను కేవలం లెక్కల ప్రక్రియగా కాకుండా, సామాజిక న్యాయానికి పునాదిగా కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని నరెడ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధన కోసం బీసీ సమాజ్‌ను గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత బలోపేతం చేసి, బీసీల హక్కుల కోసం ఐక్యంగా పోరాడుతామని



స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ జిల్లా ఉపాధ్యక్షుడు బొలిశెట్టి లక్ష్మణ్, ఏదునూరి రమేష్, రజక సంఘ నాయకుడు అడ్వకేట్ రవీందర్, నాయకులు కర్ణకంటి రవీందర్, మైనార్టీ నాయకులు ఎండి హుస్సేన్, ఎండి లతీఫ్, సురేష్, పద్మశాలి సంఘ నాయకులు పల్లపు శ్రీనివాస్, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# డీజే సౌండ్‌తో ఆరోగ్యానికి ముప్పు!



**మామడ సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి)**అధిక శబ్దంతో వినికిడి లోపం, ఒత్తిడి, నిద్రలేమి వంటి సమస్యలు: మానసిక వైద్య నిపుణులు డా. అల్లాడి సురేష్.

**డీజే శబ్దంతో ఆరోగ్యానికి ముప్పు.. జాగ్రత్త:**

అధిక శబ్దం వల్ల వినికిడి సమస్యలతో పాటు మానసిక ఒత్తిడి, నిద్రలేమి, చిరాకు, తలనొప్పి వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని మానసిక వైద్య నిపుణులు డా. అల్లాడి సురేష్ హెచ్చరించా రు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, అనారోగ్యంతో ఉన్నవారు అధిక శబ్దానికి దూరంగా ఉండాలని సూచించారు. పండుగలు, వేడుకల సందర్భంగా డీజేల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో అధిక శబ్దం వల్ల ఆరోగ్యంపై పడే ప్రభావాలపై మానసిక వైద్య నిపుణులు డా. అల్లాడి సురేష్ ప్రజలను అప్రమత్తం చేశారు. పరిమితికి మించిన శబ్దంతో డీజేలు నిర్వహించడం వల్ల శారీరకంగానే కాకుండా మానసిక ఆరోగ్యంపైనా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు.అధిక శబ్దానికి ఎక్కువసేపు గురికావడం వల్ల చెవుల్లో మోగుతున్నట్లు అనిపించడం, వినికిడి శక్తి తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. అలాగే తలనొప్పి, చిరాకు, ఆందోళన, మానసిక ఒత్తిడి, నిద్రలేమి వంటి సమస్యలు కూడా ఏర్పడవచ్చని వివరించారు.

**ఆరోగ్యంపై ప్రభావం తగ్గించేందుకు సూచనలు**

– డీజే శబ్దానికి ఎక్కువసేపు నేరుగా గురికాకుండా దూరంగా ఉండాలి.

– వీలైనంత వరకు అధిక శబ్దం ఉన్న ప్రాంతాల్లో గడిపే సమయాన్ని తగ్గించాలి.

– చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, అనారోగ్యంతో ఉన్నవారు అధిక శబ్దానికి దూరంగా ఉండాలి.

– చెవుల్లో మోగడం, వినికిడి తగ్గడం లేదా తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే శబ్దం నుంచి దూరంగా వెళ్లాలి.

– రాత్రి వేళల్లో అధిక శబ్దంతో ఇతరులకు నిద్రాభంగం కలిగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– వేడుకల నిర్వహణలో శబ్ద పరిమితులను పాటిస్తూ ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పండుగల ఆనందం ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా, శబ్ద కాలుష్యాన్ని నియంత్రిస్తూ బాధ్యతాయు తంగా ఉత్సవాలు నిర్వహించాలని డా. అల్లాడి సురేష్ సూచించా రు. ఆనందం కోసం చేసే వేడుకలు ఆరోగ్యానికి ముప్పుగా మారకుండా డీజే శబ్దాన్ని పరిమితంగా వినియోగించాలని ఆయన కోరారు.

# ప్రభుత్వ పాఠశాలలు... భవిష్యత్తుకు బాటశాలలు....






**-ప్రీ ప్రైమరీ పాఠశాలను ప్రారంభించిన ఎంఈఓ**

**-ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య**

**-క్రమశిక్షణ నైతిక విలువలకు కేరాఫ్ అడ్రస్**

**-ప్రభుత్వ బడి అమ్మ ఒడి లాంటిది**

**-బోథ్, మండల విద్యాధికారి మహమ్మద్ హుస్సేన్**

**బోథ్, సెప్టెంబర్ 21 (ప్రజా జ్యోతి)** మండలం లోని మర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో నూతనంగా మంజూరైన పూర్వ ప్రాథమిక (ప్రీ-ప్రైమరీ) ను మండల విద్యాధికారి మహమ్మద్ హుస్సేన్ సోమవారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల ఉన్నతికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని తెలిపారు. బాల్యంలోనే చిన్నారులకు పటిష్టమైన విద్యా పునాది వేయాలనే లక్ష్యంతోనే పూర్వ ప్రాథమిక తరగతులను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ఆటపాటలతో కూడిన బోధనా పద్ధతుల ద్వారా పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల వేగంగా జరుగుతుందని వివరించారు. గ్రామంలోని తల్లిదండ్రు లందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వం కల్పిస్తున్న ఈ నాణ్యమైన విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శిలా బాయి ఉప సర్పంచ్ రమేష్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమరేందర్, ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

## బుద్ధి కొండ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం



**నేరడిగొండ సెప్టెంబర్ 21(ప్రజా జ్యోతి)** మండల పరిధిలోని తేజపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుద్ధికొండ గ్రామ సబ్ సెంటర్‌లో ఉచిత క్షయ (టీబీ) వ్యాధి నిర్ధారణ పరీక్షలు మరియు (ఎన్ సి డి ) వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గ్రామానికి చెందిన ప్రజలకు ఉచితంగా టీబీ వ్యాధి లక్షణాల తనిఖీలు, ఎక్స్-రే పరీక్షలతో పాటు బీపీ, షుగర్ వంటి ఇతర దీర్ఘకాలిక వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య స్పృహ కలిగి ఉండాలని, వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలని సిబ్బంది సూచించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఎ. సంతోష్, ఎం.ఎల్.హెచ్.పి వైష్ణవి, హెల్త్ అసిస్టెంట్ సాయన్న, ఏఎన్ఎంలు మంజుల, రాణి, టీబీ ఎక్స్-రే టీమ్ సభ్యుడు శంకర్ మరియు ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో12 లక్షల అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్ ప్రారంభం

**మహిళ వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలి**

**వసతులతో పాటు ఏరియా ఆసుపత్రిగా మారుస్తాం**

**ఎమ్మెల్యే బొజ్జు పటేల్ వెల్లడి**



**ఖానాపూర్ సెప్టెంబర్ 21( ప్రజా జ్యోతి)** ఖానాపూర్ ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ ఆసుపత్రిలో సోమవారం 12 లక్షల విలువగల అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్ మిషన్ ను ఖానాపూర్ శాసనసభ్యులు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభించారు ఈ కార్యక్రమంలో డి సి హెచ్ ఎస్ డాక్టర్ కాశీనాథ్ జిల్లా వైద్య విధాన పరిషత్ అధికారి డాక్టర్ రాజేందర్ ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ స్వర్ణ రెడ్డి తాసిల్దార్ సుజాత రెడ్డి పలువురు వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఆసుపత్రి సమావేశంలో డాక్టర్లు కోరిన మేరకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్ ను మంజూరు చేయించామని ఆస్పత్రిలో అన్ని వసతుల ఏర్పాటుతో పాటు ఒక సర్జన్ ఒక ఫిజీషియన్ తో పాటు ఫిజియోథెరపీ సెంటర్ ఏర్పాటుకు పరికరా లను సమకూరుస్తామని హామీ ఇచ్చారు ఆసుపత్రిలో రోగుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించి సేవలందించాలని రానున్న రోజుల్లో ఏరియా ఆసుపత్రిగా మార్చేందుకు కృషి సల్పుతామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్ తో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ సోయాబ్ హుస్సేన్ డిసిసి ఉపాధ్యక్షులు కౌన్సిలర్ రాజురా సత్యం కౌన్సిలర్ నిమ్మల రమేష్ ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగిలి శంకర్ పట్టణ అధ్యక్షులు గొర్రె గంగాధర్ లు పాల్గొన్నారు కార్యక్రమ అనంతరం ఖానాపూర్ మున్సిపల్ చైర్పర్సన్ అంకం మౌనిక మహేందర్ కౌన్సిలర్లు తో దసం ఇందిరా బొప్పరపు సత్యవతి బండి ప్రకాష్ తదితరులు సూపరింటెంట్ స్వర్ణ రెడ్డి డి సి హెచ్ కాశీనాథ్ లతో కలిసి అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్ ఏర్పాటుతో మహిళ రోగులకు మరింత మేలు కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు

## 23న సింగాపూర్ లో ఇసుక బహిరంగ వేలం తాసిల్దార్ సుజాత వెల్లడి



ఖానాపూర్ సెప్టెంబర్ 21(ప్రజా జ్యోతి) ఖానాపూర్ మండలంలోని సింగాపూర్ గ్రామపంచాయతీలో అక్రమంగా తరలిస్తు పట్టుబడ్డ 20 ట్రిప్పుల ఇసుక డంపును బహిరంగ వేలం వేయడం జరుగుతుందని తాసిల్దార్ సుజాత రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు ఈనెల 23న సింగాపూర్ గ్రామపంచాయతీ వెనుక భాగంలో జరుగు వేలానికి పాల్గొనే వ్యక్తులు 5వెల రూపాయల ధరవత్తు చెల్లించవలసి ఉంటుందని అన్నారు సమయం ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ టెండర్లు ఎక్కువ ధర పలికిన వ్యక్తులకు ఇసుక డంపును కేటాయించడం జరుగుతుందని ఈ సందర్భంగా తాసిల్దార్ సుజాత తెలిపారు టెండర్ రాని వ్యక్తులకు ధరావత్ సొమ్ము 5వేలు తిరిగి చెల్లిస్తామన్నారు మరిన్ని వివరాలకు జీపీఓ వినయ్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ జక్కుల నగేష్ సెల్ నెంబర్ 9866197289 సంప్రదించాలన్నారు

## ప్రజావాణి దరఖాస్తులు త్వ రితగతిన పరిష్కరిం చాలి

**ఐటీడీఏ ఉట్నూర్ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి జాదవ్ వసంత్ రావు**



ఉట్నూర్, సెప్టెంబర్ 21 (ప్రజా జ్యోతి) ప్రజావాణి దరఖాస్తులు త్వ రితగతిన పరిష్కరించాలని ఐటీడీఏ ఉట్నూర్ ఐటిడిఎ అసిస్టెంట్ ప్రజెక్టు అదికారి జాదవ్ వసంత్ రావు అన్నా రు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్ర మంలో ప్రజల నుంచి అందుతున్న దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఉట్నూర్ ఏ పి ఓ జాదవ్ వసంత్ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయం లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల వినతులను ఆయన స్వీకరించి, సంబంధిత శాఖల అధి కారులకు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూ చించారు.నార్నూర్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన బాపూరావు తనకి ఏడ్ల జత మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. నిర్మల్ మండలం నిర్మల్ గ్రామానికి చెందిన స్వాతి తనకు ఫార్మసిస్ట్ ఉద్యోగం ఇ ప్పించమని కోరారు. ఉట్నూ ర్ మండలం చందూరి గ్రామానికి చెందిన ధనరాజు తనకు ఏదైనా ఉద్యోగం మంజూరు కల్పించమని విజ్ఞప్తి చేశారు. గాదిగూడమండలం రాముగూడ గ్రామానికి చెందిన మడావి రాజుతనకు ఆటో మంజూరు కొరకు దరఖాస్తు అందజేశారు. సిర్పూర్(యు మండలం కోహినూర్ గ్రామానికి చెందిన విజయలక్ష్మి తమ గ్రామానికి గ్రామ పంచాయతీ భవనం, నీటి సౌకర్యం కలిపించండి అని కోరారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాలలబ్ధి, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యల పరిష్కారం తదితర అంశాలపై తమ వినతిపత్రాలను సమర్పించారు.ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖ అధికారులు బాధ్యతా యుతంగా పరిశీలించి, నిబంధ నల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి జాదవ్ వ సంత్ రావ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రికి కొండ లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి

**-భవిష్యత్ తరాలకు లక్ష్మణ్ బాపూజీ ఆదర్శ బాటలు**

**-బోథ్ మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు ఆసల సదాశివ్**



మండలంలోని ధన్నూర్ బి గ్రామంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు అసల సదాశివ్ మాట్లాడుతూ కొండ లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర వహించి తెలంగాణ కోసం తన మంత్రి పదవిని త్యాగం చేసిన మహనీయులు అని పేర్కొన్నారు. ఆయన చేసిన సేవలను ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. బోథ్ మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రికి కొండ లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సంతోష్ నరసయ్య శంకర్ రాజేశ్వర్ నారాయణ భూమేష్ రమేష్ రవి సంజీవ్ నవీన్ సాయికుమార్ కుల బంధువులు పాల్గొన్నారు

## శాంతి గణేష్ మండల్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం

**జర్నలిస్టుకు సన్మానం**



అదిలాబాద్ టౌన్, సెప్టెంబర్ 21 (ప్రజా జ్యోతి) అదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్ 34వ వార్డు గందేవార్ తోటలో వెలసిన వినాయక చవితి ఉత్సవాలలో శాంతి గణేష్ మండల్ సభ్యులు ఆధ్యాత్మికతతో పాటు సామాజిక స్పృహను చాటుకున్నారు. ఉత్సవాల సందర్భంగా స్థానిక ప్రజల సమక్షంలో సోమవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అంతేకాకుండా, సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తూ, ప్రజా సేవలో ముందుండే జర్నలిస్టు అన్నంవార్ దత్తు సు నిర్వాహకులు మాజీ మంత్రివర్యులు జోగు రామన్న చేతుల మీదుగా ప్రత్యేకంగా సన్మానించి తమ ఉదారతను, గౌరవాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా శాంతి యూత్ సభ్యులు మాట్లాడుతూ... సమాజ వికాసానికి, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి జర్నలిస్టులు చేస్తున్న కృషి అనిర్వచనీయమైనదని కొనియాడారు. సమాజ హితం కోసం నిరంతరం శ్రమించే విలేకరులను గుర్తించి గౌరవించడం తమ కనీస బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, అనుముల సతీష్, కృష్ణ పవన్, మురళి, హనుమండ్లు కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ను పుష్పగుచ్చంతో ఆహ్వానించిన డిసిహెచ్ కాశీనాథ్, సూపరిండెంట్ డాక్టర్ స్వర్ణ రెడ్డి



ఖానాపూర్ సెప్టెంబర్ 21( ప్రజా జ్యోతి) ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా రోగులకు సంబంధించిన అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్ ను ప్రారంభించేందుకు సోమవారం ఎమ్మెల్యే వెడమ బొజ్జుపటేల్ ఆసుపత్రికి విచ్చేసిన సందర్భంగా డి సి హెచ్ డాక్టర్ కాశీనాథ్ ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ స్వర్ణ రెడ్డిలు పుష్పగుచ్చంతో ఆహ్వానించారు ఇందులో మున్సిపల్ వైస్ చైర్మన్ సోయాబ్ హుస్సేన్ కౌన్సిలర్ తోడసం ఇందిరా మండల పార్టీ అధ్యక్షులు జంగిలి శంకర్ కడెం నాయకులు రాజేష్ జన్నారం శంకర్ మైస శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనది

**మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక**



ఖానాపూర్ సెప్టెంబర్ 21 (ప్రజా జ్యోతి )సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని, భావి భారత పౌరులను తీర్చిదిద్దే గొప్ప బాధ్యత వారిపైనే ఉందని ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది ఉపాధ్యాయులకు ఎంఈఓ బి సంధ్యారాణి తో కలిసి ప్రశంసా పత్రాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

**సన్మానం పొందిన 20 మంది ఉపాధ్యాయుల వివరాలు:**

ఎ. రమాదేవి పాత ఎల్లాపూర్, ఖానాపూర్ టి. శంకర్ మస్కాపూర్, బి. కిష్టయ్య సత్తాంపెల్లి, విజయ్ ఖానాపూర్, పి. విజయలక్ష్మి ఖానాపూర్, పి. ముత్తన్న బీర్నంది, సి.హెచ్. శ్రీనివాస్ సూరజ్‌పూర్, కె. శ్రీనివాస్ రాజురా, ఆర్. కిషన్ ప్రసాద్ మస్కాపూర్, నచేందర్ పాత ఎల్లాపూర్, అనీయున్నీసా ఖానాపూర్, ఆర్. రవితాదేవి మస్కాపూర్, షరీఫా బేగం ఇంద్రానగర్, బి. మురళి కొత్తపేట్, కె. అశోక్ రాజురా, బి. ఫణీంద్ర బావాపూర్ (కె),ఎస్. అనిల్ విద్యానగర్, పి. సంధ్య చింతలపేట్, బి. రాజశేఖర్ తర్లపాడు, ధన్ సింగ్, ఇక్బాల్‌పూర్ ఈ కార్యక్రమంలో మండల మస్కాపూర్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు నర్సయ్య, వాహెద్ ఖాన్, శ్యాంప్రసాద్, మురళీధర్, అంజయ్యలతో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

## కమల్‌కోట్‌లో చేయూత పెన్షన్ల వెరిఫికేషన్



**మామడ సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి)** మామడ మండలంలోని కమల్‌కోట్ గ్రామంలో చేయూత పెన్షన్ల వెరిఫికేషన్ ప్రక్రియను సోమవారం నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రావుల ముత్యం రెడ్డి, ఏపీఎం సునంద, సీసీ సంతోష్, సీఏ నీరజతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని వారు తెలిపారు.

## మామడ పీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ



మామడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ)రాజేందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వైద్య సేవలు, రోగులకు అందుతున్న చికిత్స, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆసుపత్రిలో పరిశు భ్రతను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు.

## పొన్కల్‌లో గణేష్ మండపం వద్ద ఘనంగా కుంకుమ పూజ



**మామడ సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి)**మామడ మండలంలోని పొన్కల్ గ్రామంలో శివాజీ మున్నూరు కాపు యూత్ గణేష్ మండపం వద్ద సోమవారం భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, గణనాథుడికి కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా గణేశుడిని భక్తిశ్రద్ధలతో పూజించి, గ్రామ ప్రజలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని కోరుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు కార్యక్రమంలో నిర్వాహకులు, మహిళలు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



**నేరడిగొండ, సెప్టెంబర్ 21 (ప్రజాజ్యోతి):** మండలంలోని కుమారి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, మహి ళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో పోషణ మాసంలో భాగంగా 'మన అంగన్వాడీ.. మన బాధ్యత' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారు లకు అందిస్తున్న పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న 'ఆరోగ్యలక్ష్మి' పథకంలోని పౌష్టికాహారాన్ని అర్హులైన గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్థిక అక్షరాస్యత నిపుణుడు నిఖిలేశ్వర్ రెడ్డి సూచించారు. పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లులు, పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరుచు కోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంగన్వాడీ టీచర్ సుమలత ఆశా కార్యకర్త పుష్పలత, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలను పకడ్బందిగా పర్యవేక్షించాలి

**ఐటిడిఎ డి. డి. జి, అశోక్**





**ఉట్నూర్, సెప్టెంబర్ 21, (ప్రజా జ్యోతి )** గిరిజన సంక్షేమ శాఖ ప్రాథ మిక పాఠశాలలను పకడ్బందిగా పర్యవేక్షించే బాధ్యత ఎస్.సి.ఆర్.పి. లదేనని జి ల్లా గిరిజన సంక్షేమ శాఖ డి ప్యూటీ డైరెక్టరు జి. అశోక్ తెలిపారు. సోమవారం ఉట్నూర్ పి.ఎం.ఆర్. సి. సమా వేశమందిరంలో జరిగిన ఎ స్. సి. ఆర్. పి. ల సమీక్షా సమావేశంలో ప్రసంగించారు. ఉపాధ్యాయులు సమమపాలన పాటించేలా చూడడం, చక్కటి విద్యాబుద్ధులు పిల్ల లకు నేర్పించేలా చూడాల న్నారు. విద్యార్థుల హాజరు పై దృష్టి సారించాలని, బడి ఈడు పిల్లలందరిని బడిలో ఉండేలా చూడాలని సూచించారు. ప్రతి ఎస్.ఇ.ఆర్.పి.లు ప్రతి రోజు తమ పరిధిలో గల రెండు పాఠశాలలను సందర్శించాలన్నారు. తల్లిదండ్రులు, గ్రామ పెద్దల ను పాఠశాల అభివృద్ధిలో, విద్యార్థుల హాజరు శాతం పెంచడంలో భాగస్వాముల ను చేయాలని కోరారు. ఆట, పాటలతో గుణత్మక విద్య బోధన జరిగేలా చూడలని చెప్పారు. అనంతరం హెచ్ డబ్లు ఓల సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. మెను అమలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై మార్గదర్శనం చేసారు. ఈకార్యక్ర మములో డిప్యూటీ డీ. ఈ. ఓ. గోడం చంధన్, ఎసీ ఎంఓ క్రాంతి కుమార్, జిల్లా గిరిజన క్రీడల అధికారి కెపార్థసా రథి, బహుభాష సమన్వయ కర్తతోడ్సం దేవురావ్ తదితరులు పాల్గొన్నారు.

## అడేగామ( బి) లో ఆయుర్వేదిక్ మెడికల్ క్యాంపు







**ఇచ్చోడ సెప్టెంబర్ 21(ప్రజా జ్యోతి):** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో ని ఆదేగామ ( బి)లో సోమవారం మెడికల్ హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అవినాష్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. అలాగే ఇంటింటికి తిరుగుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. ఆయుర్వేదిక్ డాక్టర్ అవినాష్ 43 మందికి ఆయుర్వేదిక్ మందుల గురించి వివరంగా తెలియజేశారు. అదేవిధంగా యం ల హెచ్ పి డాక్టర్ హరిత ఎన్ సి డి క్యాంప్ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కమల హెల్త్ అసిస్టెంట్స్ రాజ్ కిరణ్ రెడ్డి, సుభాష్ బ్రీడింగ్ చెక్కర్స్ వసంతరావు, సుభాష్, ఆశ వర్కర్ గంగామణి ,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ భూమేష్‌అంతిమ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**ఖానాపూర్ సెప్టెంబర్ 21 (ప్రజా జ్యోతి)**ఖానాపూర్ నియోజకవర్గంలోని కడెం మండలం ఎలగడప గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమేష్ గుండెపోటుతో అకస్మిక మృతి చెందగా, ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్య క్షులు వెడ్మ బొజ్జు పటేల్ ఎలగడప గ్రామానికి వెళ్లి భూమేష్ పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం భూమేష్ అంతి మయాత్రలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మృతుని కు టుంబ సభ్యుల ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొ న్నారు భూమేష్ మృతితో కుటుంబ సభ్యులతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు శోక సముద్రంలో మునిగిపోయారు

## పోన్కల్‌లో ఘనంగా కుంకుమార్చన కార్యక్రమం



**మామడ సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి)** హిందూ టైగర్స్ యూత్ ఆధ్వర్యంలో పోన్కల్ గ్రామంలో కుంకు మార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సంద ర్భంగా మహిళలు పెద్ద సం ఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజ లు, కుంకు మార్చన నిర్వ హించారు. ఆధ్యాత్మిక వాతా వరణంలో సాగిన కార్యక్రమంలో భక్తులు అమ్మవారిని దర్శిం చుకుని గ్రామ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, గ్రా మాభివృద్ధి కోసం ప్రార్థించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసా దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హిందూ టైగర్స్ యూత్ సభ్యులు, మహిళలు, యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కొండ లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



ఖానాపూర్ సెప్టెంబర్ 21 (ప్రజాజ్యోతి) స్వతంత్ర సమరయోధుడు ప్రజా న్యాయవాది స్వరాష్ట్ర కోసం పదవులు తునప్రాయంగా త్యాగం చేసిన కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఖానాపూర్ లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన సేవలు కొనియాడారు ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు గడదాసు రవి చరణ్ డబ్బా శ్రీనివాస్ గంగారం తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు

## శివాజీ నగర్ గణేష్ మండలి వద్ద మా అన్నదానం



ఖానాపూర్ సెప్టెంబర్ 21 (ప్రజా జ్యోతి ) గణపతి నవరాత్రుల్లో భాగంగా ఖానాపూర్ పట్టణంలోని శివాజీ నగర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ మండలి వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం కార్యక్రమంలో స్థానిక సిఐ సత్యనారాయణ ఎస్సై రాహుల్ గైక్ వాడితో పాటు పట్టణంలోని పలువురు ప్రముఖులు శివాజీ నగర్ వీధి ప్రజలు తదితరులు పాల్గొని విగ్నేశ్వరుని పూజలు నిర్వహించి అన్నప్రసాదాన్ని స్వీకరించారు ఇందులో శివాజీ నగర్ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా గణేష్ నిర్వాహకులు తుమ్మలపల్లి లక్ష్మణ్ ను సన్మానించారు

## తహసీల్దార్ కు అదివాసీ సంక్షేమ పరిషత్ మెమోరాండం



సోనాల, సెప్టెంబర్ 21 (ప్రజాజ్యోతి ): సోనాల మండల కేంద్రంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో తహసిల్దార్ మల్లేష్ కు మెమొరండం సమర్పించడం జరిగింది. 1950 సంవత్సరం నుంచి ఉన్నట్లు నిరుపించని లంబాడిలకు ఎస్టి కాస్ట్ సర్టిఫికెట్స్ ఏజెన్సీ సర్టిఫికెట్ జారి చేయరాదని, సోనాల మండలం మహారాష్ట్ర సరిహద్దుకు అనుకోని ఉండం వల్ల అనేక లంబాడి కుటుంబాలు విచ్చలవిడిగా ఇక్కడ వలస వచ్చి నివసిస్తున్నాయని, అంతే కాకుండా వారు నిబంధనలకు విరుద్ధంగా ఎస్టి క్యాస్ట్ సర్టిఫికెట్, మరియు ఏజెన్సీ సర్టిఫికెట్ పొంది మా రిసర్వేషన్ ఉద్యోగాలు, రాజకీయ పదవులు సంక్షేమ పథకాలు పొందుతున్నారని, దీని వల్ల అసలైన ఎస్టి ఆదివాసిలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది కావున వలస వచ్చిన లంబాడిలకు 1950 సంవత్సరానికి సంబందించిన ఆధారాలు ఉంటేనే ఎస్టి క్యాస్ట్ సర్టిఫికెట్ మరియు ఏజెన్సీ సర్టిఫికెట్ జారి చేయాలనీ, ఎలాంటి ఆధారాలు లేని వారికి జారి చేయకూడదని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదివాసీ అనుబంధ సంఘాల పెద్దలు ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు జుగ్నక్ మారుతి,రాయి సిడం జాకేష్, సర్మేడి తొడషం లక్ష్మణ్, గౌరవ అధ్యక్షులు బందుపటేల్, సలహాదార్ తొడషం గంగాధర్, రాందాష్, కుమారం మానిక్ రావ్, సిడం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యపై సర్పంచ్ తక్షణ స్పందన



నేరడిగొండ, సెప్టెంబర్ 21 (ప్రజాజ్యోతి): మండలంలోని పిచర గ్రామంలో గల టి.డబ్ల్యు.పి.ఎస్ ప్రభుత్వ పాఠశాల మైదానంతో పాటు గ్రామంలోని పలు వీధులు ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారి ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గ్రామ ప్రజలు సర్పంచ్ బైరి లింగవ్వ రాజేందర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సర్పంచ్ గ్రామంలో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. ప్రజలకు, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా పాఠశాల మైదానంతో పాటు బురదమయమైన గ్రామ వీధుల్లో మురం పోయించి రోడ్లను మెరుగుపరిచారు. సమస్యను తమ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే స్పందించి పరిష్కరించిన సర్పంచ్‌కు గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

## నటరాజ డ్యాన్స్ అకాడెమీ విద్యార్థుల వినాయక జన్మ రహస్యం నృత్య రూపకం.





తాండూరు, సెప్టెంబర్ 21: ప్రజాజ్యోతి శ్రీ గణేశ్ మండలి తాండూరు వారి ఆధ్వర్యంలో అదివారం రాత్రి నిర్వహించిన వినాయక నవరాత్రి వేడుకల్లో నటరాజ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన "వినాయక జన్మ రహస్యం" నృత్య రూపకం విశేషంగా ఆకట్టుకుంది.నృత్య గురువు అల్లాడి అర్చన జయప్రకాశ్ శిక్షణలో విద్యార్థులు భక్తి, నృత్యం, అభినయంతో వినాయకుడి జన్మ వృత్తాంతాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. కూచిపూడి నృత్య శైలిలో సాగిన ఈ నృత్య రూపకం ప్రేక్షకులను విశేషంగా అలరించింది.వినాయకుడి జననం, పార్వతీదేవి సృష్టి, శివపార్వతుల కథాంశాలను నృత్యం, అభినయం, సంగీతంతో విద్యార్థులు చక్కగా ఆవిష్కరించారు. ప్రదర్శన అనంతరం విద్యార్థులను శ్రీ గణేష్ మండలి నిర్వాహకులు, సభ్యులు, భక్తులు అభినందిశిచి వారిని శాలువాలతో, మెమెంటులతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నటరాజ డ్యాన్స్ అకాడమీ నృత్య గురువు అల్లాడి అర్చన జయప్రకాశ్ మాట్లాడుతూ, భారతీయ శాస్త్రీయ నృత్యం ద్వారా మన పురాణాలు, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు ఇటువంటి నృత్య రూపకాలను శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

## ఇరిగేషన్ ఈఈగా భీమ్ రావు పదవి బాధ్యతలు

**కలెక్టర్ ను కలిసి పుష్ప గుచ్చం అందించిన ఈ ఈ**



ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 21,(ప్రజా జ్యోతి) నీటిపారుదల డివిజన్ నం. 2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బి.భీమ్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వీసీ హాల్ ఆవరణలో జిల్లా కలెక్టర్ రాజర్షిషాను మర్యా దపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఈఈ కి కలెక్టర్ శుభాకాంక్షలు తెలుపుతూ, జిల్లాలో నీటిపారుదల శాఖ అభివృద్ధి, పనుల నిర్వహణను సమర్థవంతంగా, పా రదర్శకంగా నిర్వహించాలని సూచించారు.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

**క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలకు పరిష్కారం చూపాలి**

**అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్**



ఆసిఫాబాద్, సెప్టెంబర్ 21 ప్రజా జ్యోతి ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.రెబ్బెన మండలం గోలేటికి చెందిన లావుడ్య మమత ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరగా, జైనూర్ మండలం జంగాం గ్రామానికి చెందిన కొడప అనుతారావు దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. సిర్పూర్(టి) మండలం పారిగాం గ్రామానికి చెందిన దుర్కే విశ్వనాథ్ నిలిచిపోయిన పింఛన్‌ను పునరుద్ధరించాలని కోరారు. జిల్లా కేంద్రానికి చెందిన కాంబ్లే కీర్తికుమార్ ప్రభుత్వ వైద్య కళాశాలలో పొరుగు సేవల కింద ఉద్యోగ అవకాశం కల్పించాలని వినతిపత్రం అందజేశారు.సిర్పూర్(టి) మండల కేంద్రానికి చెందిన గద్దల రమేష్ విశ్వకర్మ పథకం కింద రుణ సదుపాయం కల్పించాలని కోరగా, చింతలమానేపల్లి మండలం బాబాసాగర్‌కు చెందిన పిప్పిరే బాబాజీ తన వాటా భూమిని ఇతరులు ఆక్రమించారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యకు తగిన పరిష్కారం చూపేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు.కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

# బాలికల సంక్షేమమే మోదీ లక్ష్యం

**:శ్రీకృష్ణదేవరాయలు బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు**

తాండూర్ సెప్టెంబర్ 21 ప్రజాజ్యోతిదేశంలోని బాలికల సంక్షేమం కోసం పనిచేస్తున్న ఏకైక ప్రభుత్వం కేంద్రంలోని మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వమని బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చిలుముల శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఈ సందర్భంగా బిజెపి ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. నేటి బాలలే రేపటి దేశ పౌరులని విద్యార్థులంతా క్రమశిక్షణతో చదివి ఉన్నతమైన స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం బాలికల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతుందని తెలిపారు. 25 ఏళ్ల ప్రజా జీవితంలో ఈ దేశానికి మోదీ విశేష సేవలందించారని గుర్తు చేశారు. మోడీ ప్రభుత్వం ఈ దేశంలోని మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం



లో కస్తూర్బా గాంధీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కవిత,బిజెపి మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్,జిల్లా కార్యదర్శి రామగౌని మహీధర్ గౌడ్, సీనియర్ నాయకులు మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి,జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధం మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్ మండల కార్యదర్శి గాదె రాజేశం మండల నాయకులు ఆవుల చందు,కామెర మహేష్, ఉపాధ్యాయు రాలు సుమన చైతన్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రపల్లిలో ఘనంగా సామూహిక కుంకుమార్చన

**తాండూర్ సెప్టెంబర్ 21 ప్రజాజ్యోతి** తాండూర్ మండలంలోని చంద్రపల్లి గ్రామంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహిళల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన పూజలు ఘనంగా నిర్వహించారు.పండితులు అజయ్ ఆచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథుడిని భక్తిశ్రద్ధలతో పూజించి, గ్రామ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని భక్తులు ప్రార్థించారు. కుంకుమార్చనలో అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో చంద్రపల్లి



గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# చీలపల్లిలో టీ ఏ జి ఎస్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**ఆదివాసీ హక్కుల కోసం ఉద్యమాలు ఉధృతం చేస్తాం**

**ఆసిఫాబాద్ సెప్టెంబర్ 21 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి): మండలంలోని చీలపల్లి గ్రామంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీ ఏ జి ఎస్) నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర 4వ మహాసభల ఆహ్వాన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెలిశాల కృష్ణమాచారి ఆధ్వర్యంలో సోమవారం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల పరిరక్షణకు సంఘం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోంద న్నారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో అక్టోబరు 1 నుంచి 4 వరకు టీ ఏ జి ఎస్ రాష్ట్ర 4వ మహాసభలు నిర్వహించను న్నట్లు తెలిపారు. 1, 2 తేదీల్లో ఆదివాసీ కళారూపాలతో సాంస్కృతిక కార్యక్రమాలు, బహిరంగ సభ, 3, 4 తేదీల్లో ప్రతినిధుల సభ ఉంటాయని వివరించారు. పోడు భూములకు హక్కు పత్రాలు, తునికాకు బోనస్ కోసం పోరాటాలు నిర్వహించి ఫలితాలు సాధించా మని తెలిపారు. ఆదివాసీ గ్రామాల్లో రహదారులు, తాగునీరు, విద్య,





వైద్యం వంటి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. 1/70, పేసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఆదివాసీల హక్కులకు భంగం కలిగితే ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.కమిటీ: కన్వీనర్‌గా అరుణ, కో-కన్వీనర్‌గా తిరుమల, యాక్టివ్ మెంబర్‌గా బి. దేతు, సభ్యులుగా ఆత్రం భారతి బాయి, కుర్సెంగ నీలా భాయి, సుర్పం హంసాబాయి, ఆత్రం విజయ లక్ష్మి, సుర్పం లక్ష్మీబాయి, ఎర్గటి బాయక్క, సుర్పం సునీత బాయి, ఆత్రం పార్వతి, మానేపల్లి రాజేశ్వరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## నిర్మల్ జిల్లా మహిళా మోర్చా ఇన్‌చార్జిగా నల్లుల సంగీత





BHARATIYA JANATA PARTY -
Dr.ShyamprasadMukherjiBhavan, Kattelamandi, HYD-500 001

Press Release
MahilaMorcha District Incharges

As Instructed by Sri N. RamchanerRao, Ex. MLC, BJP State President, the Mahila Morcha District Incharges are hereby announced.

| # | District Name | District Incharge Name |
|---|---|---|
| 1 | Adilabad | Dhoni Jyothi |
| 2 | Mancherial | Anita Komravelli |
| 3 | Nirmal | N. Sangeetha |
| 4 | Komarambhim Asifabad | Bodasu Madhavi |
| 5 | Nizamabad | P.S. Vijaya Bhavani |
| 6 | Kamareddy | Vemula Vaishali |
| 7 | Karimnagar | Vijayalakshmi. K |
| 8 | Jagtial | Mathongi Renuka |
| 9 | Peddapalli | E. Uma Reddy |
| 10 | Rajanna Sircilla | Bhanupriya |
| 11 | Sangareddy | Kosika Shailaja Goud |
| 12 | Medak | Arakala Sudha |
| 13 | Siddipet | Vishalini. K |
| 14 | Rangareddy Urban | Sridevi Bollepalli |
| 15 | Rangareddy Rural | Kothapalli Padma |
| 16 | Vikarabad | Sahu Sreelatha |
| 17 | Medchal Urban | Pragathi. S |
| 18 | Medchal Rural | Prasanna. M |
| 19 | Nalgonda | K. Suguna Reddy |
| 20 | Suryapet | Sudharani Munagala |
| 21 | Yadadri Bhongir | K. Saritha |

**తాండూర్ (బెల్లంపల్లి) సెప్టెంబర్ 21 ప్రజాజ్యోతి** బీజేపీ మహిళా మోర్చా నిర్మల్ జిల్లా ఇన్‌చార్జిగా బెల్లంపల్లికి చెందిన ప్రముఖ న్యాయవాది నల్లుల సంగీత నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఆమెను నియమించారు. ఈ సందర్భంగా నల్లుల సంగీత మాట్లాడుతూ తనకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, మహిళా మోర్చా విస్తరణకు కృషి చేస్తానన్నారు. నిర్మల్ జిల్లాలో మహిళలను పెద్ద సంఖ్యలో పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తూ సంస్థాగతంగా మహిళా మోర్చాను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి రఘునాథ్, జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## భూ సేకరణ, పునరావాస ప్రక్రియ వేగవంతం చేయాలి

**రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**

**సెప్టెంబర్ 21,సిర్పూర్-టి కాగిస్టేన్సీ కరెస్పాండెంట్ ప్రజాజ్యోతి, కబీర్ అహ్మద్:** రాష్ట్రంలో చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణంలో భూములు, ఇండ్లు



కోల్పోతున్న వారికి మెరుగైన పరిహారం అందించి పునరావాసం కల్పించాలని జిల్లా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ లోని సచివాలయం నుండి రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, నీటిపారుదల శాఖ కార్యదర్శులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణంలో ముంపుకు గురయ్యే భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. భూములు, ఇండ్లు కోల్పోయే వారికి త్వరగా పరిహారం అందించి పునరావాసం కల్పించాలని, రైతులకు మెరుగైన మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందించాలని తెలిపారు. భూ సేకరణ పునరావాసం ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని, భూసేకరణ ప్రక్రియలో రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు తిరుపతి, భద్రయ్య, కె.వి. రమణ, వేణుగోపాల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి లాభాల్లో 35 శాతం వాటా ప్రకటించాలి

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఎండీ డైరెక్టర్ (పా)కు ఐఎన్‌టీయూసీ నాయకుల విజ్ఞప్తి

**మంచిర్యాల, సెప్టెంబర్ 21 (ప్రజా జ్యోతి):** సింగరేణి సంస్థ ఆర్జిస్తున్న లాభాల్లో కార్మికులకు 35 శాతం వాటా ప్రకటించాలని, కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ నాయకత్వంలో ప్రతినిధి బృందం సింగరేణి సీఎండీ, డైరెక్టర్ (పా)లను కలిసి కార్మికుల సమస్యలపై చర్చించింది. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ నాయకులు పలు డిమాండ్లను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. సింగరేణి సంస్థ ఆర్జించిన లాభాల్లో కార్మికులకు 35 శాతం వాటా ప్రకటించాలని కోరారు. కార్మికుల వైద్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహించాలని, వైద్యపరంగా అనర్హులైన కార్మికులను నిబంధనల ప్రకారం మెడికల్ అన్‌ఫిట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో నిర్వహించిన మెడికల్ బోర్డుల నిర్ణయాలను పునఃసమీక్షించి, సంబంధిత కార్మికులకు మరో అవకాశం కల్పించాలని కోరారు. అలాగే సింగరేణి కార్మికుల సొంత ఇంటి పథకాన్ని సాధ్యమైనంత త్వరగా అమలు చేసేందుకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో చర్చించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు సంబంధించిన పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మినహా



యింపు అంశాన్ని దసరాలోపు పరిష్కరించాలని కోరారు. ఐఎన్‌టీయూసీ ప్రతినిధి బృందం చేసిన విజ్ఞప్తులపై సింగరేణి యాజమాన్యం సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇచ్చినట్లు ఐఎన్‌టీయూసీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ధర్మపురి, సమ్మయ్య, త్యాగరాజన్, జెట్టి శంకరరావు, జనరల్ సెక్రటరీలు వికాస్ కుమార్ యాదవ్, అక్రమ్, రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు దాస్, రఘుపతిరెడ్డి, రవీందర్ రెడ్డి, రజాక్, రీజినల్ జనరల్ సెక్రటరీలు ఆల్బర్ట్, ట్రైసన్ శ్రీనివాస్, కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు రావర్తి శ్రీనివాస్, పైరేమియా తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లకు నోటీసులు జారీ చేసి హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

### రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి

**సెప్టెంబర్21,సిర్పూర్-టి కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి, కబీర్ అహ్మద్:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా మ్యాపింగ్ కాని, అనమలిస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ లోని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రాజస్వ మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి మాట్లాడుతూ అక్టోబర్ 20వ తేదీలోగా అనమలిస్ జాబితాలో గల ఓటర్లు, మ్యాపింగ్ కాని ఓటర్ల హియరింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. సంబంధిత ఓటర్లు సమర్పించిన వివరాలను డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేసేలా పర్యవేక్షించాలని తెలిపారు. ఫారం 6, 7, 8 దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని, ఓటరు నమోదు కోసం అందించే ఫారం 6 తో డిక్లరేషన్ తీసుకోవాలని, హియరింగ్ ప్రక్రియ ప్రశాంతంగా చేపట్టాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్



అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 1 లక్ష 676 నోటీసులను సంబంధిత ఓటర్లకు అందించడం జరిగిందని, 56 వేల 538 మంది ఓటర్ల హియరింగ్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, అక్టోబర్ 15వ తేదీలోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫారం 6, 7, 8 దరఖాస్తుల పరిష్కారానికి అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో హియరింగ్ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు

**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 21,(ప్రజా జ్యోతి)** సోమవారం సాయంత్రం ఆదిలాబాద్ పట్టణంలోని మార్వాడీ ధర్మశాలలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధర్మశాలలో ప్రతిష్ఠించిన వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వా హకులు కిషోర్ కుమార్, మార్వాడీ సంఘం సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





## జాతీయ ఆయుర్వేద దినోత్సవ పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 21, (ప్రజా జ్యోతి)** సోమవారం కలెక్టరేట్ సమా వేశ మందిరం ఆవరణలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ ఆయుర్వేద దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆయుష్ నోడల్ ఆఫీసర్ చంద్రశేఖర్, కన్వీనర్ ఇక్రముద్దీన్, ఆయు ర్వేద మెడికల్ ఆఫీసర్ ప్రీతల్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

## పునరావాస పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలి

### రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి






**ఆదిలాబాద్ బ్యూరో సెప్టెంబర్ 21(ప్రజాజ్యోతి)** నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం పునరావాసం, పునరావాస పునరుద్ధరణ పనులను వేగ వంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉ త్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఆ దిలాబాద్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షిషా పా ల్గొన్నారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు రూ.6 వేల కోట్ల వరకు ని ధులు విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ.2,550 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. విడుదలైన నిధులతో అవార్డులు జారీ చేసిన భూములకు పరిహారం చెల్లింపులను తక్ష ణమే పూర్తి చేయాలని ఆదే శించారు. భూసేకరణకు ప్రత్యేక అధికారులను నియ మించి, ప్రతి వారం పురోగతి పై సమీక్ష నిర్వహించాలని సూచించారు. రైతులతో నేరుగా చర్చించి, నిబంధనల ప్రకారం, మార్కెట్ విలువ కు సాధ్యమైనంత సమీపంగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చే శారు. ఎస్ ఎల్ బీ సీ సొరంగం పూర్తయ్యేలోపు పెండ్లి పాకల రిజర్వాయర్ పనులు పూర్తయ్యేలా భూసేకర ణను ప్రాధాన్యతతో చేపట్టాలని మంత్రి ఆదేశించారు. స మస్యలు ఉంటే భూసేకరణ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూ చించారు. అవార్డులు జారీ చేసిన భూములకు పరిహా రం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించా రు. ప్రధాన కార్యదర్శి సంజ య్ జాజు మాట్లాడుతూ, భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులకు సంబంధించి సుమారు రూ.3,100 కోట్ల ప నులను గుర్తించగా, రూ.2, 514 కోట్ల మేర నిధులు వి డుదల చేసినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీ వో జగదీశ్వర్‌రావు, జె ఈ ప్రశాంత్, ఏవో వర్ష, అధికారులు తదితరులు పాల్గొ న్నారు.

## ఎయిర్‌పోర్ట్ పనులను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**





**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 21,(ప్రజా జ్యోతి)** జిల్లాలో ప్రతిష్టాత్మక విమానాశ్రయ నిర్మాణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మంది రంలో విమానాశ్రయ ప్రాజెక్టు పనుల పురోగతిపై ఆయన అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్య మంత్రి నేడు విమానాశ్రయ ప్రాజెక్టుపై ప్రత్యేక సమీక్ష ని ర్వహించనున్న నేపథ్యంలో, ఈ సమావేశానికి ప్రాజెక్టుకు సంబం ధించిన సమగ్ర వివరాలు, తాజా నివేదికలతో పూర్తి సన్నద్ధంగా ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా భూ సేకరణ, క్షేత్రస్థాయి సర్వే, తదితర కీలక అంశాలపై అధికారు లతో చర్చించారు. పనుల్లో ఎలాంటి జాప్యానికి తావులేకుండా, సంబంధిత శాఖలన్నీ పరస్పర సమన్వ యంతో బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన తదుపరి చర్యలను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమా వేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్.రాజేశ్వర్, నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ జగదీష్, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, ఎస్.ఈ. ప్రభు కళ్యాణ్, విద్యుత్ శా ఖ ఎస్ఈ సుభాష్, భూ స ర్వే, కొలతల శాఖ ఏడి ప్రభాకర్, ఏవో వర్ధ, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఆర్ అండ్ బి ఈఈ రమే ష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, ఆయా మండలాల తహసీల్దార్లు సిబ్బంది, తది తరులు పాల్గొన్నారు.

## రాజేష్ మృతిపై ఎన్ హెచ్ఆర్సీలో పిటిషన్..

**ఈశ్వరమ్మ ఫోన్‌పై విచారణకు డిమాండ్..**

**మృతుడు రాజేష్ మృతి పై సమగ్రమైన విచారణ జరిపించాలి ..**

**ఫోకస్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ...**

**రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ శివ కుమార్**

**ఎల్‌బీనగర్...:** ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన రాజేష్ మృతిపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్ హెచ్ఆర్సీ)లో పిటిషన్ దాఖలు చేసినట్లు మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంపల్లి శివకుమార్ తెలిపారు. రాజేష్ మృతిపై స్వయంచాలకంగా కేసు నమోదు చేసి సమగ్ర విచారణ చేపట్టాలని పిటిషన్‌లో కోరినట్లు వెల్లడించారు.రాజేష్ మృతికి సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు వనస్థలిపురం ఏసీపీ, సంబంధిత సీఐలను కలిసి ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నట్లు శివకుమార్ తెలిపారు.ఇదిలా ఉండగా.. యాదగిరిగుట్ట బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్ వ్యవహారంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రాజేష్ తల్లికి ఈశ్వరమ్మ యాదవ్ ఎందుకు ఫోన్ చేశారు? ఫిర్యాదు చేయాలని ఎందుకు సూచించారు? రాజేష్ కుటుంబంతో ఆమెకు ఉన్న సంబంధం ఏమిటి? అనే అంశాలపై స్పష్టత రావాల్సిన అవసరం ఉందన్నారు.రాజకీయ నాయకురాలిగా ప్రజలకు సలహా ఇవ్వడం సాధారణమే అయినప్పటికీ.. ప్రత్యేకంగా రాజేష్ తల్లికి ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించడంపై విచారణ జరగాలని శివకుమార్ కోరారు. ఈ ఫోన్ సంభాషణకు సంబంధించిన నేపథ్యం, కారణాలను దర్యాప్తులో తేల్చాలని అన్నారు.స్థానికంగా పలువురు రాజకీయ నాయకులు

# ప్రభుత్వ ఉద్యోగులందరికీ శాలరీ ప్యాకేజీ బీమా వర్తిం పజేయాలి

**జీవో నెం. 77 ప్రకారం ప్రయోజనాలు కల్పించాలి**

**జిల్లా కలెక్టర్‌కు 'టీఈజేఏసీ నేతల వినతి**

**బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ**



**ఆదిలాబాద్ బ్యూరో , సెప్టెంబర్ 21:(ప్రజా జ్యోతి)** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది అందరికీ శాలరీ ప్యాకేజీ అకౌంట్ ద్వారా లభించే ఉచిత బీమా రక్షణను వెంటనే అమలు చేయాలని ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (టిఈజెఎసి) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా టీఈజేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ కార్యదర్శి ఎ. నవీన్ కుమార్, కన్వీనర్, టీజీవోస్ జిల్లా అధ్యక్షుడు కాండ్లి శివ కుమార్ మాట్లాడుతూ జీవో ఎంఎస్ నెం. 77 (ఆర్థిక శాఖ, తేదీ: 25-06-2026) ప్ర కారం ప్రభుత్వం నిర్దేశించిన 16 బ్యాంకుల ద్వారా శాలరీ ప్యాకేజీ బీమా పథకాన్నిపూ ర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు.ఉద్యోగులకు ఒప్పంద రాయితీలు అందించాలని,మోరటోరియం అగ్రిమెంట్ (ఎంఓ యు) ప్రకారం ఆయా బ్యాంకులు ఉద్యోగులకు అందించాల్సిన రాయితీలు, ఉచిత బీమా వర్తించేలా చర్యలు తీసుకోవాలని నేతలు విజ్ఞప్తి చేశారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి, పెన్షనర్, కాంట్రాక్ట్ సిబ్బంది తమ శాలరీ అకౌంట్ ద్వారా ఈ పథ కంలో కవర్ అయ్యేలా సంబంధిత డ్రాయింగ్ అండ్‌డి స్బర్సింగ్ ఆఫీసర్లు (డిడి ఓలు),బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

**కలెక్టర్ సానుకూల స్పందన**

ఉద్యోగ సంఘాల వినతిపై జిల్లా కలెక్టర్ రాజర్షిషా సానుకూలంగా స్పందించారు. త్వరలోనే సంబంధిత బ్యాంకు అధికారులతో (బ్యాంకర్లతో) ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఒప్పంద నిబంధనల (యం ఓ యు ఎస్) ప్రకారం ప్రతి ఉద్యోగికి బీమా వర్తిం చేలా, బ్యాంకుల ద్వారా ల భించే రాయితీలు అందేలా తగిన ఆదేశాలు ఇస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉద్యోగ జేఏ సీ నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## వీరభద్ర స్వామి సన్నిధికి భక్తిశ్రద్ధలతో పాదయాత్ర

**నూకల అభినవ్ రెడ్డి మొక్కు పాదయాత్రలో పాల్గొన్న ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్**

పురుషోత్తమాయగూడెం నుంచి కురవి శ్రీ వీరభద్ర స్వామి ఆలయం వరకు నూకల నరేష్ రెడ్డి తనయుడు నూకల అభినవ్ రెడ్డి చేపట్టిన మొక్కు పాదయాత్ర భక్తిశ్రద్ధలతో కొనసాగింది. సోమవారం నిర్వహించిన ఈ పాదయాత్రలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ పాల్గొని అభినవ్ రెడ్డితో కలిసి పాదయాత్ర చేశారు.పెద్ద సంఖ్యలో భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొనడంతో పాదయాత్ర సందడిగా సాగింది. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్, నూకల అభినవ్ రెడ్డి శ్రీ వీరభద్ర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నూకల అభినవ్ రెడ్డిని, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్దలు ఘనంగా సన్మానించి శాలువాలతో అభినందించారు.

## గణనాథునికి జిల్లా ఎస్పీ మహేష్ బి గితే దంపతులు ప్రత్యేక పూజలు

**భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జనం**

**రాజన్న సిరిసిల్ల :** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతిష్ఠించిన గణపతి విగ్రహానికి జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుడు ప్రజలందరికీ సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలను ప్రసాదించాలని, ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బంది చేపట్టిన ప్రతి కార్యం ఎలాంటి విఘ్నాలు లేకుండా విజయవంతంగా పూర్తయ్యేలా ఆశీర్వదించాలని మహాగణపతిని ప్రార్థించినట్లు తెలిపారు.గత ఏడు రోజులుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో విశేష పూజలు అందుకున్న గణనాథుని నిమజ్జన కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ శోభాయాత్రను ప్రారంభించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని డప్పు వాయిద్యాల నడుమ కోలాటాలు, ఆటపాటలతో గణనాథునికి వీడ్కోలు పలికారు.గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడంలో సహకరించిన పోలీస్ అధికారులు,

## జలదృశ్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ఘన నివాళులు

**హైదరాబాద్ :** స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్ జలదృశ్యంలో ఉన్న ఆయన విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ పద్మశాలి కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, తెలంగాణ హ్యాండ్లూమ్/లూమ్ కార్పొరేషన్ చైర్మన్ దూడెం వెంకటరమణ, తుడా చైర్మన్ గుండు సుధారాణి, వకులాభరణం కృష్ణమోహన్ తదితరులు పాల్గొని బాపూజీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్య ఉద్యమం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం వరకు ప్రజల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని గుర్తుచేశారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, తెలంగాణ సాధన కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన పదవిని సైతం త్యాగం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. బీసీలు, చేనేత కార్మికులు, పద్మశాలీల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గాంధీభవన్‌లో కూడా తెలంగాణ ఖఅఅ మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి కాంగ్రెస్ శ్రేణులు బాపు కొండా లక్ష్మణ్ చిత్రపటానికి నివాళులు అర్పించారుకొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు సామాజిక న్యాయం, సమానత్వం, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు, పద్మశాలి సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులర్పించారు.

## ట్యాంక్ బండ్ వద్ద ఉద్రిక్తత

**హైదరాబాద్ :** సోమవారం నాడు హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై ఉద్రిక్తత నెలకొంది. గణేష్ నిమజ్జనంపై ఆంక్షలకు నిరసనగా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆందోళనకు దిగింది. ట్యాంక్ బండ్పై గణేష్ నిమజ్జనాన్ని నిషేధించడంపై భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు.. ట్యాంక్ బండ్ చుట్టూ ఏర్పాటు చేసిన బారికేడ్లను సమితి ప్రతినిధులు తొలగించారు. పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు భారీగా పోలీసులు మోహరించారు.